# యాచారం సాగర్ రహదారిపై ప్రమాదాలు



ప్రమాదాలకు దారిస్తున్న యాచారంలో సాగర్‌పై ఉన్న బ్రేక్ కట్ట

**యాచారం నవంబరు15,ప్రభాతవార్త :** యాచారం గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ఉన్న సాగర దారిపై గల బ్రేక్ కట్ట ఎంతోమంది ప్రాణాలను గాల్లో కలుపుతున్న ఎన్నో మార్లు సంబంధింత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకునే నాథుడు కరవయ్యాడని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.యాచారం మండలంలోని సాగర్ రహదారి నిరంతరం వాహనాల రద్దీ ఎంతగానో ఉంటుంది. గ్రామపంచాయతీ సమీపంలో గతంలో వాహనాలు వేగం తగ్గించడానికి స్పీడ్ బ్రేకర్ వేశారు.అది గమనించని ఎంతోమంది ప్రయాణికులు చూసుకోలేక తీవ్ర ప్రమాదాలకు గురైతున్నారు.స్థానికులు ఎంతోమంది దీనిపై పిర్యాదు చేసిన సంబంధిత గ్రామ సర్పంచ్ అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సుమారు వందమందికిపైగా అక్కడ స్థలంలో ప్రమాదాలు జరిగాయని ఎంతోమంది ఆసుపత్రుల పాలయ్యారని అక్కడ స్థానికులు తెలుపుతున్నారు.ప్రయాణికుల ప్రాణాలు కాపాడడం కోసం తక్షణమే అలా ఉన్న బ్రేక్ కట్టను తీసేసి సమాంతరంగా ఉండే వేగాన్ని నియంత్రించే పరికరాలతో కూడుకున్న బ్రేక్ నియంత్రణ వాటిని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.ప్రాణాలు పోతే గాని సమస్య పట్టదా అన్నట్టు ప్రయాణికులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తక్షణమే పంచాయతీ కార్యదర్శి ,సర్పంచ్ దానిపై పరిష్కారం కోసం కృషి చేయాలని లేని పక్షంలో ఆందోళన తప్పదని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## కోరం లేక జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా

**వికారాబాద్,నవంబర్ 15, ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. జిల్లా పరిషత్ చైర్పర్సన్ పి.సునీతారెడ్డి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ చైర్పర్సన్ సునీతారెడ్డి, వైస్ చెర్మన్ బి.విజయకుమార్, బంట్వారం జడ్పిటిసి సభ్యురాలు సంతోషలు మాత్రమే హాజరయ్యారు. జిల్లాలో 19 మంది జడ్పిటిసి సభ్యులు ఉండగా, కేవలం ముగ్గురు సభ్యులు హాజరయ్యారు. సభ్యులు లేకపోవడంతో కోరం లేనందున సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు జడ్పి సిఇఓ జానకిరెడ్డి తెలిపారు. తదుపరి సమావేశం నిర్వహించే తేదీని త్వరలో తెలియజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈఓ సుభాషిణి, జిల్లా అధికారులు తరుణ్ కుమార్, పాల్వన్‌కుమార్, మల్లేష్, కోటాజీ, సుధారాణి, ఉపేందర్, జాకబ్, బాబు మోజెస్, బాబు శ్రీనివాస్, రేణుకాదేవీ,వినయ్ కుమార్, రాజేశ్వర్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి




# కొడంగల్ అసెంబ్లీ ఎన్నికల బరిలో 13 మంది అభ్యర్థులు

**కొడంగల్ నవంబర్ 15ప్రభాతవార్త**

కొడంగల్ అసెంబ్లీ ఎన్నికల బరిలో 13 మంది అభ్యర్దులు పోటీలో ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్ తెలిపారు.బుధవారంతో ఎన్నికల నామినేషన్‌ల ఉపసంహారణ ముగియడంతో ఇద్దరు అభ్యర్దులు తమ నామినేషన్‌లను ఉపసంహారించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈనెల 3 నుంచి ఈనెల 10 వరకు నామినేషన్‌ల దాఖలు గడువు ఉండడంతో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్దులతో పాటు మొత్తం 16 మంది నామినేషన్‌లు దాఖలు చేయగా నామినేషన్‌ల స్రూటినీలో ఒక అభ్యర్ది ఫాం-ఏ,ఫాం-బి సమర్పించక పోవడంతో 15 మంది అభ్యర్దులు ఉండగా నామినేషన్‌ల ఉపసంహారణలో ఇద్దరు స్వతంత్ర అభ్యర్దులు తమ నామినేషన్‌లను ఉపసంహారించుకోవడంతో బరిలో 13 మంది అభ్యర్దులు ఉన్నట్లు తెలిపారు.

# జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల బరిలో 61 మంది అభ్యర్థులు

**-అత్యధికంగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలి**
**-జిల్లాలో 1133 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు**
**-విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి**

**వికారాబాద్,నవంబర్ 15, ప్రభాతవార్త:** ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 61 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్నాయని, వికారాబాద్ అసెంబ్లీ స్థానానికి 12 మంది అభ్యర్థులు, పరిగి అసెంబ్లీ స్థానానికి 15 మంది అభ్యర్థులు, తాండూర్ అసెంబ్లీ స్థానానికి 21 మంది అభ్యర్థులు, కొడంగల్ అసెంబ్లీ స్థానానికి 13 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నట్లు చెప్పారు. 30వ తేదీన జరిగే పోలింగ్‌కు అవసరమైన ఈవీఎం యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 9,60,376 ఓటర్లు ఉన్నారని వివరించారు. వారిలో 4,77,508 మంది పురుషులు, 4,82,802 మంది మహిళా ఓటర్లు, 40 మంది ట్రాన్స్ జెండర్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 1133 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఓటరు తుది జాబితాలను రూపొందించడం పూర్తి అయిందని గుర్తింపు పొందిన అభ్యర్థులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఓటర్లకు ఓటరు స్లిప్పులు అందేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఓటర్ స్లిప్పులను 22, 23 తేదీలలో పూర్తి అవుతుందన్నారు. ప్రతి కుటుంబానికి అన్ని విషయాలు తెలిసేలా రూపొందించిన ఓటర్ గౌడ్ బుక్‌లెట్ తోపాటు సి.విజిల్ యాప్‌కు సంబంధించిన బుక్‌లెట్ అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో హోం ఓటింగ్ కు సంబంధించి 300 మంది ధరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ప్రచారాన్ని నిర్వహించుకోవచ్చని, ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారం నిర్వహించుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు పాటిస్తూ ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకోవాలని తెలిపారు. ఓటింగ్ శాతం పెరిగేలా జిల్లాలోని ఓటర్లు అందరు వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్ నారాయణ అమిత్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

# పేదలకు అందాల్సిన భూమిని ప్లాట్లు చేసి అమ్ముకున్నారు

**- కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షులు కొదండ రెడ్డి**
**- కిషన్‌రెడ్డి చేసిన భూ కబ్జాల వివరాలన్ని మావద్ద ఉన్నాయి**
**- పరిశ్రమల పేరుతో భూములు సేకరించి ఒక్కరికి కూడ ఉద్యోగం ఇవ్వలేదు**



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి,కాంగ్రెస్ కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షులు కొదండ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, నవంబర్ 15, ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం బస్ డిపో పక్కన ఉన్న భూమిలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించాలని కాంగ్రెస్ కోట్లాడితే రాత్రికి రాత్రే ఓఆర్సి తెచ్చి కబ్జా చేసి పాట్లు చేసి అమ్ముకున్న ఘనత మంచిరెడ్డి కిషన్‌రెడ్డిదేని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి,కాంగ్రెస్ కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షులు కొదండ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుదవారం మంచాల మండలంలో ప్రచారం నిర్వహించారు.రంగాపూర్,జాపాల్ మధ్యలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నంలోని ఫార్మాసిటి, ఆధిబట్లలో ఉద్యోగాల పేరుతో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని పేదల భూములు గుంజుకొని భారీ భూ కుంభకోణం చేసారని ఆరోపించారు. యాచారం మండలం మేడిపల్లి, తాడిపర్తి ఫార్మసిటిలో అధికార పార్టీ ఎమ్మెల్యే సుమారు రూ.63కోట్ల కుంభకోణం చేసాడని ఆరోపించారు. మూడు సార్లు గెలిచి ఇబ్రహీంపట్నంలో చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కలెక్టర్ కార్యలయం ఏర్పటు చేయకూ డదని ఎనిమిది మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు అడ్డుకొని రాజేంద్రనాగర్‌లో ఏర్పాటు చేయాలన్నారు. కాంగ్రెస్ తరపున కేసులకు వెనకాడకుండ ఉద్యమం చేసి ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కలెక్టర్ కార్యలయం ఏర్పటు చేసు కోవడం జరిగిందన్నారు. దేవుడి దయతో నిండిన ఇబ్రహీంపట్నం చేరువుని కృష్ణా జలాలతో నింపామని పచ్చి అబద్ధాలు ఆడారన్నారు. ఇబ్రహీంపట్నం బంగారు తునకగా మార్చడమంటే బంగారు ఘనులల్లో పెట్టుబడులు పెట్టాడమా అని ప్రశ్నించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రే పచ్చి అబద్ధాలు మాట్లాడితే దేనికి సంకేమని దుయ్యబెట్టారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసామన్నారు ఎక్కడ కట్టారో చెప్పాలని ప్రశ్నించారు.ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రి పశువుల కొట్టంగా ఉంది కనీసం దానిని పట్టించుకునే నాధుడు లేడన్నారు. ట్రైనింగ్‌లో ఉన్న నర్సులతో కూ.ని ఆపరేషన్లు చేయించి నలుగురు మహిళల మరణానికి కారణమయ్యారన్నారు.ఇటీవల ఒ వ్యక్తి కడుపునొప్పితో ఆస్పత్రిలో చికిత్స కోసం వస్తే డాక్టర్లు లేక మరణించిన విషయాలను గుర్తు చేశారు.కాంగ్రెస్ అధికాంలోకి వచ్చిన వెంటనే ఇబ్రహీంపట్నంలో ఎమ్మెల్యే అయన అనుచరుడు ఇద్దరు కలిసి చేసిన అవినీతి అక్రమాలు, భూకబ్జాలపై విచారణ జరిస్తామన్నారు.కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీఅని అధికారంలోకి రాగానే ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీని భారీ మేజార్టీతో గెలిపాంచాలని కొరారు. ఈ సమావేశంలో టిపిసిసి సభ్యులు మర్రి నిరంజన్ రెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మిపతి గౌడ్, ఈసి శేఖర్ గౌడ్ (మామ), సిపిఐ నాయకలు నర్సింహ్మా, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

# ఫైలెట్‌కు పరేషాన్.!

**- కలవర పెడుతున్న పార్టీ ఫిరాయింపులు**
**- తాండూరులో గులాబీ ఎదురు ఈత?**
**- సొంత పార్టీ నేతలే వెన్నుపోటుదారులా ?**
**- అయోమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి**

**తాండూరు, నవంబరు 15, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులో బీఆర్ఎస్ అభ్యర్థి స్థానిక ఎమ్మెల్యే ఫైలట్ రోహిత్‌రెడ్డికి సమస్యలు చుట్టుముడుతున్నాయి.పార్టీ పిరాయింపు నేతలతో తీవ్రంగా కలవర పడుతున్నారు. వెన్నంటి ఉండి.. ఆయనతో కలిసి ప్రచారం చేస్తూ.. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో పలువురు గులాబీ నేతలు పార్టీ మారడంతో బీఆర్ఎస్ పార్టీలో ప్రతికూలత నెలకొంది.తాండూరు నియోజవకర్గంలోని నాలుగు మండలాలతో పాటు తాండూరు మున్సిపల్ పరిధిలో గులాబీకి ఎదురుగాలీ వీస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే పెద్దేముల్, తాండూరు, బషీరాబాద్ మండలాల నుండి పెద్ద ఎత్తున్న నేతలు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. వివిధ మండలాల ఎంపీపీలు, జెడ్పిటీసీలు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, పీఏసీఎస్ చైర్మన్‌లు, వివిధ గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. దీంతో సొంత పార్టీ నేతలే వెన్నుపోటు దారులుగా పార్టీలు మారుతున్నారా నా అనుమానులు వ్యక్తం అవుతున్నాయి.అంటూ పలువురు చర్చించుకుంటున్నారు. అయితే, తాండూరు నియోజకవర్గ వ్యాప్తంగా గత కొంత కాలంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అనుసరిస్తున్న తీరుపై, పార్టీలో గుర్తింపు లేకుండా పోయిందనే ఆవేదనతోనే పార్టీ మారుతున్నట్లు పలువురు బహిరంగంగానే చెప్పుకోవడం విశేషం. మరోవైపు నియోజకవర్గంలో మూడు మండలాలలో బీఆర్ఎస్ పార్టీ నేతలు పార్టీ మారడంతో కారుకు ఎదురుగాలి వీస్తుందని.. తాండూరులో కాంగ్రెస్ వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారంటూ.. ప్రతిపక్ష పార్టీల నేతలు జోరుగా ప్రచారం చేసుకుంటున్నారు. ఏదిఏమైనా అధికార పార్టీపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను ప్రతిపక్ష పార్టీలు తమ వైపు తిప్పుకుంటున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# మేడ్చల్ జిల్లా బరిలో 126మంది అభ్యర్థులు

**-64మంది నామినేషన్ల ఉపసంహరణ**
**-మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్**
**-మేడ్చల్‌లో 22మంది, మల్కాజ్‌గిరిలో 33మంది, కుత్బుల్లాపూర్‌లో 15మంది, కూకట్‌పల్లిలో 24మంది, ఉప్పల్‌లో 32మంది పోటీ**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 15, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగ ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నామినేషన్ల పరిశీలన తరువాత 190మంది నామినేషన్లు ఉండగ వీరిలో 64మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు, ఇక ఎన్నికల బరిలో 126మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ వివరించారు. బుధవారం జిల్లా వ్యాప్తంగ నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రయ ముగిసింది. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఆయన పోటీలో ఉన్న అభ్యర్థులు, నామినేషన్ల ఉపసంహరణ వివరాలు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ నామినేషన్ల పరిశీలన తరువాత 190మంది అభ్యర్థులు ఉండగ వీరిలో బుధవారం వరకు 64మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారని, ఇక ఎన్నికల పోటీలో 126 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు వివరించారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాలలో బరిలో ఉన్న వారి వివరాలు తెలియజేశారు. మేడ్చల్‌లో 105నామినేషన్లు స్వీకరించగ, వీటిలో 38తిరస్కరించబడినట్లు, 67మంది ఉండగ వీరిలో 45మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు, ఇక ఎన్నికల బరిలో 22మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. మల్కాజ్‌గిరిలో 49నామినేషన్లు రాగ వీటిలో 8తిరస్కరించగ, 41మంది ఉండగ వీరిలో 8మంది నామినేషన్లు విరమించుకున్నట్లు, ఇక ఎన్నికల బరిలో 33మంది పోటీలో ఉన్నట్లు తెలిపారు. కుత్బుల్లాపూర్‌లో 32నామినేషన్లు స్వీకరించగ వీటిలో 10మందివి తిరస్కరించగ, 22మందిలో 7మంది తన నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు ఇక బరిలో 15మంది పోటీలో ఉన్నట్లు తెలిపారు. కూకట్‌పల్లి నుంచి 38నామినేషన్లు స్వీకరించగ, వీటిలో 12నామినేషన్లు తిరస్కరించబడగ, 26మందిలో ఇద్దరు మాత్రమే నామినేషన్లు ఉపసంహరించుకోగా ఎన్నికల బరిలో 24మంది పోటీలో ఉన్నట్లు తెలిపారు. ఉప్పల్‌లో 37నామినేషన్లు స్వీకరించగ వీటిలో ముగ్గురి నామినేషన్లు తిరస్కరించబడగ, 34మంది ఉండగ వీరిలో ఇద్దరు మాత్రమే నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు, ఇక ఎన్నికల బరిలో 32మంది పోటీలో నిలిచారని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్ వివరించారు. ఇక ఈ నెల 30వ తేదీన ఎన్నికలు (పోలింగ్) జరగనున్నాయి.

# అభివృద్ధి జరగాలంటే బిజెపిని గెలిపించాలి

**-చేవెళ్ల బిజెపి అభ్యర్థి కెఎస్ రత్నం పిలుపు**

**చేవెళ్ల, నవంబర్ 15, ప్రభాతవార్త**

అభివృద్ధి జరుగాలంటే బిజెపికి ఓటు వేసి గెలిపించాలని చేవెళ్ల బిజెపి అభ్యర్థి కెఎస్ రత్నం అన్నారు.బుదవారం చేవెళ్ల మండలం దేవునిఎర్రవల్లి, ఇబ్రహింపల్లి గ్రామాలల్లో కర్ణాటక ఎమ్మెల్యే చంద్రప్పతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు.గోల్లపల్లి,దేవునిఎర్రవలల్లి గ్రామానికి చేందిన పలువురు బిజెపిలో చేరారు. దేవునిఎర్రవల్లి గ్రామ మాజీ సర్పంచ్ శ్యామలయ్యతో పాటు అనేక మంది బిజెపికి కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల బిజెపి అభ్యర్ధి కెఎస్ రత్నం మాట్లాడుతూ అభివృద్ధికి అమడ దూరంలో తెలంగాణ ఉందన్నారు. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకంలేదని ప్రజా వ్యతిరేక బిఆర్ఎస్ ప్రభుత్వంకు తగిన గుణపాఠం చేప్పాలన్నారు.బిజెపి ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. రాష్ట్రంలోని ప్రజలు బిజెపి ప్రభుత్వం రావాలని కోరుతూ స్వచ్ఛందంగా బిజెపిలో చెరుతున్నారన్నారు. ప్రజల అందదండలతో బిజెపి చేవెళ్లలో విజయం సాధించడం జరుగుతుందన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా బిజెపి పార్టీ నిలుస్తుందన్నారు.చేవెళ్ల నియోజకవర్గంలోని ప్రతి గ్రామంను అభివృద్ధి చేస్తామన్నారు. బిఆర్ఎస్ కాంగ్రేస్ అభ్యర్దులు ఇద్దరు బేదిరింపులకు పాల్పడుతారన్నారు. నియోజవర్గంలోని సామాన్య ప్రజలను దోచుకుతిన్నారన్నారు. మహిళలు, యువకులు అలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. గతంలో ఎం చేశారని మళ్లీ ఓట్లు అడుగేందుకు వస్తున్నారంటూ నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మండల బిజెపి అద్యక్షుడు పాండురంగారెడ్డి కార్యదర్శి అనంతరెడ్డి తదితరులు పాల్గోన్నారు.



బిజెపి అభ్యర్ది కెఎస్ రత్నం సమక్షంలో బిజెపిలో చేరిన దేవుని ఎర్రవల్లి మాజీ సర్పంచ్ శ్యామలయ్య

# కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం

**- బీఆర్ఎస్ పాలనలో అంతా అవినీతి**
**- కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి**



ప్రచారంలో పాల్గొన్న మనోహర్‌రెడ్డి

**బషీరాబాద్, నవంబరు 15, ప్రభాతవార్త :** గత తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అంతా అవినీతి మయంగా మారిందని... కాంగ్రెస్ హాయాంలోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాయని కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ హయాంలో నిరుపేదలకు ఇండ్లు, సాగునీటి ప్రాజెక్టులు ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. బుధవారం బషీరాబాద్ మండల పరిధిలోని మైల్వార్, మైల్వార్ తాండ, కంసాన్‌పల్లి, కంసాన్‌పల్లి తాండ, ఎక్మాయి, మంథన్‌గౌడ్ తాండ, ఇందర్‌చెడ్, నావాంద్గి, గంగ్వార్, క్యాద్గిర, జీవన్గీ గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ హాయాంలోనే నిరుపేదలకు ఇండ్లు, ఉపాధి కల్పించడంతో పాటు వ్యవసాయానికి సంబంధించి నీటి ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. తాండూరు నియోజకవర్గంలో నిరుపేదలకు ఇండ్లు, సంక్షేమ పథకాలు అందాయని.. బీఆర్ఎస్ హయాంలో అవినీతి కుంబకోణంలో మునిగిపోయిందని, పార్టీ నాయకులకే సంక్షేమ పథకాలు అందించారని ఆరోపించారు. బషీరాబాద్ మండల పరిధిలో నిరుపేదలకు, అర్హులైన వారికి బీసీ బంధు, గృహాలక్ష్మి పథకాలు అందాయా అన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కోట్ల రూపాయల డబ్బులు ఎలాసంపాదించాడని.. ప్రజల డబ్బులనే దోచుకున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటువేయాలని కోరారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలు నిరుపేదలకు ఎంతో మేలు జరుగనుందని తెలిపారు. తాండూరు ప్రజలు అవినీతి మయంగా మారిన బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మనోహర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు జవహర్‌నగర్,మేడ్చల్‌లో రేవంత్‌రెడ్డి కార్నర్ మీటింగ్స్

**-కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 15, ప్రభాతవార్త**

మేడ్చల్ నియోజకవర్గంలోని జవహర్‌నగర్‌లో, మేడ్చల్‌లో గురువారం టిపిసిసి అధ్యక్షులు ఎ.రేవంత్‌రెడ్డి కార్నర్ మీటింగ్స్ జరుగుతున్నందున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ పేర్కొన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని జవహర్ నగర్‌లో ఉదయం 10గంటలకు మున్సిపల్ ఆఫీస్ సమీపంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కార్నర్ మీటింగ్ జరుగుతుందన్నారు. ఆ మధ్యాహ్నం 12గంటలకు మేడ్చల్ పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్నర్ మీటింగ్ జరుగుతుందన్నారు. దీనిలో మేడ్చల్ నియోజకవర్గ నాయకులు, ఏబ్లాక్, బి.బ్లాక్, మండలాల, మున్సిపాల్టీల, కార్పోరేషన్‌ల పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు,పార్టీ అనుబంధ కమిటీల వారు అందరు పాల్గొని విజయవంతం చేయాలని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్ కోరారు.

# ఇ.పట్నం బరిలో 28మంది అభ్యర్థులు

**ఇబ్రహీంపట్నం, నవంబర్ 15, ప్రభాతవార్త:** సాధారణ ఎన్నికలు జోరందుకున్నాయి.నామినేషన్ల ఉపసంహరణ గుడువు ముగి సింది.39 మంది అభ్యర్థులు 54 సెట్ల నామినేషన్లు దాఖలు వేయగా పరిశీలనలో నాలుగు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 35 మిగలగా మంళ,బుధవారం ఎడుగురునామినేషన్లు ఉపసంహరింకున్నారు.ఇక బరిలో 28 మంది ఉన్నారు. ప్రచారం జోరందుకుంది.అభ్యర్థులు తనదైన శైలిలో ప్రచారం చేస్తున్నా రు.ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు అన్ని పార్టీల నేతలు విశ్వప్రయత్నాలు చేస్తు న్నారు.అయితే ప్రజలు ఎవరికి పట్టం కడతారనేది తేలాల్సి ఉంది.30న అసెంబ్లీ ఎన్ని కలు జరగనున్నాయి.డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**-మరొకరికి గాయాలు**

**శామీర్‌పేట, నవంబరు 15, ప్రభాతవార్త**

మజీద్‌పూర్-తుర్కపల్లి గ్రామాల మధ్య రాజీవ్‌రహదారిన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగ, మరొకరికి గాయాలు అయినట్లు జీనోమ్ వ్యాలీ పోలీస్ ఇన్స్‌పెక్టర్ రాజ్‌గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ వైపున నుంచి తుర్కపల్లికి వెళ్లె రాజీవ్ రహదారిన బైక్ వెళ్తుండగ అదుపుతప్పి కిందపడిపోవటంతో ఓ వ్యక్తి మృతి చెందగ, మరొకరికి గాయాలు అయినట్లు పోలీసులు పేర్కొన్నారు. జీనోమ్ వ్యాలీ పోలీసుల కథనంప్రకారం శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ వైపున నుంచి తుర్కపల్లికి బైక్‌పై ఇద్దరు వెళ్తుండగ అటవీ అథితి గృహం సమీపంలోకి చేరుకోగానే బైక్ అదుపుతప్పి కింద పడిపోయినట్లు తెలిపారు. దీనిలో శామీర్‌పేట మండలం యాడారం గ్రామానికి చెందిన చిటుకుల శేఖర్‌రెడ్డి(45), మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడకు చెందిన వీరన్నగారి బాబు ఇరువురు బైక్‌పై వెళ్తున్నారు. బైక్ అదుపుతప్పి కింద పడిపోవటంతో యాడారంకు చెందిన చిటుకుల శేఖర్‌రెడ్డి (45) తలకు తీవ్రగాయాలకు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. జగ్గంగూడకు చెందిన వీరన్నగారి బాబుకు స్వల్ప గాయాలు అయినట్లు తెలిపారు. అయితే మృతిచెందిన శేఖర్‌రెడ్డి మెడిసిటీ హాస్పిటల్‌లో జాబ్ చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంగ హాస్పిటల్‌మార్చూరికి తరలించారు. జీనోమ్‌వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు మర్పల్లికి కెటిఆర్ రాక

**మర్పల్లి నవంబర్ 15 ప్రభాతవార్త :** గురువారం నాడు రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కేటీఆర్ మర్పల్లిమండలానికి రానున్నట్లు పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి,జడ్పీటీసి మధుకర్,ఎంపిపి లలిత రమేశ్ ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి సినియర్ నాయకులు ప్రభాకర్ గుప్తా,టౌన్ అద్యక్షులు గఫార్‌లు తెలిపారు.మండలంలో రోడ్‌షో నిర్వహిండం జరుగుతుందని బంట్వారం,మోమిన్‌పేట్,మర్పల్లి నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ వారు కోరారు.

## ఎన్నికల ఏర్పాట్లపై చర్చించిన అధికారులు


ఎన్నికల పరిశీలకులతో కలెక్టర్, సీపీ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** శాసనసభ సాధారణ ఎన్ని కల ప్రక్రియలో భాగంగా బుధవారం కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జనగామ జిల్లాకు చెందిన జనరల్ పరి శీలకులు కె.రాజమణి, పోలీసు పరిశీలకులు సుజీత్ కుమార్‌లు జిల్లా కలెక్టరేట్‌గా రాగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, సీసీ శ్వేతలు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. జనగామ నియోజకవర్గం లోని చేర్యాల, మద్దూరు, దూళ్‌మిట్ట, కొమురవెల్లి మండలాల్లో ఎన్నికల ఏర్పాట్లుపై చర్చించారు. కేం ద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం 4 మండలాల్లో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నియమ నిబంధనల అమలుపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు పరిశీలకులు సోనమ్ టెన్సింగ్ భూటియ ఉన్నారు.

## స్వాములకు అన్నదానం


ఘట్‌కేసర్‌లో స్వాములకు అన్నదాన కార్యక్రమం జరిగిన దృశ్యం

**ఘట్‌కేసర్, నవంబరు 15, ప్రభాతవార్త** ఘట్‌కేసర్ మున్సిపాల్టీలోని శివారెడ్డిగూడ, దండ్లగడ్డ ప్రసన్న వీరాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీధర్మశాస్త్ర సేవాసమితి స్వాములకు బుధవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. వనభోజన కార్యక్రమంలో భాగంగ కోసూరి సుజిని,రామకృష్ణ, శ్రీనివాస్ రాజులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

**పాపన్నపేట, నవంబరు 15, ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో చోటుచేసుకుంది. ఎఎస్ఐ గాలయ్య కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు... గ్రామానికి చెందిన తాడూరి ఎల్లయ్య, కిట్టమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. గత 12 సంవత్సరాల క్రితం ఎలలయ్య మృతి చెందగా అప్పటి నుంచి కిష్టమ్మ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. పెద్ద కుమారుడైన సుమన్ (21) కూలీ పనులు చేస్తూ ఉన్నాడన్నారు. మంగళవారం రాత్రి కిష్టమ్మ డ్వాక్రా గ్రూపులో చిట్టి డబ్బులు తీసుకుని రావడంతో డబ్బులు ఎందుకు తెచ్చావని సుమన్ తల్లి కిష్టమ్మతో గొడవకు దిగడంతో తల్లి కిష్టమ్మ తన చెల్లి ఊరైన నార్సింగికి వెళ్లిపోయిందన్నారు. సుమన్ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. బుధవారం ఉదయం అటుగా వచ్చిన బంధువులు గమనించి కిష్టమ్మకు, పోలీసులకు సమాచారం అందించగా పోలీసుటు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి శవానికి పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

## రేపటిలోగా ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తవ్వాలి : కలెక్టర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబరు 15, ప్రభాతవార్త:** ఈ నెల 16వ తేదీ లోగా ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్పుల పంపిణి పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. బుధవారం రిటర్నింగ్ అధికారులు సహాయం రిటర్నింగ్ అధికారులు, సెక్టోరల్ అధికారులు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు బిఎల్ఓలు, సంబంధిత నోడల్ అధికారులతో కలెక్టర్ టెలికాన్సరెన్స్ ద్వార పలు సూచలను చేశారు. ఓటర్ స్లిప్పుల పంపిణి, మదర్ రోల్ ప్రింటింగ్, మార్కెట్ కాపీఈ తదితర అంశాలలప సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఓటరకు విధిగా ఓటరు స్లిప్పులు అందించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారిగా ముద్రించిన ఓటరు స్లిప్పుల పంపిణి ఈ నెల 16వ తారీఖులోగా వంద శాతం పూర్తి కావాలని స్పష్టం చేశారు. ప్రతి గడప గడపకు వెళ్లి స్లిప్పులు అందించాలన్నారు. బూత్ లెవల్ అధికారి, బిఎల్ఓ సూపర్‌వైజరన సెక్టోరల్ అధికా రులు సమన్వయంతో ఓటరు స్లిప్పుల పంపిణి పూర్తి చేయాలన్నా రు. ప్రతి ఒక్కరు విధిగా తమ ఓటును సద్వినియోగం చేసుకోవాల ని సూచించారు. ఓటరు స్లిప్పుల పంణిలో అలక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కాన్ఫరెన్స్‌లో డిఆ ర్ఓ నగేష్, రిటర్నింగ్ అధికారులు, ఏఆర్ఓలు, సెక్టోరల్, నోడల్ అధికారులు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు, బిఎల్ఓలు పాల్గొన్నారు.

## పోలింగ్, కౌంటింగ్ రోజుల్లో సెలవులు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం అదేశాల మేరకు ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్న జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థలకు, కార్యాలయాలకు, ఎన్నికల పోలింగ్ 30న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, కార్యాలయాలు, పరిశ్రమలకు వేతనంతో కూడిన సెలవులను ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్‌జీవన్ పాటిల్ బుధవారం తెలిపారు. ఓట్ల లెక్కింపు ఒక రోజు ముందు డిసెంబర్ 2, ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3, వేతనంతో కూడిన సెలవును ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాహనం తనిఖీ


బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

**పటాన్‌చెరు, నవంబర్ 15, ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి వాహనాన్ని ఎన్నికల అధికారులు బుధవారం మధ్యాహ్నం పటాన్‌చెరు టోల్ గేట్ వద్ద తనిఖీ చేశారు. అందుకు ఎమ్మెల్యే జీఎంఆర్ వారికి సహకరించి, తనిఖీలు పూర్తి అయ్యే వరకు వేచి ఉన్నారు. ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియలో భాగంగా తనిఖీలు సాధారణం అని, వారికి సహకరించాల్సి భాద్యత మనపై ఉందని ఆయన తెలిపారు.

## పాఠశాల పిల్లలో నోటి సంరక్షణపై అవగాహన సమావేశం

**సంగారెడ్డి, నవంబర్ 15 ప్రభాతవార్త :** పాఠశాల పిల్లల్లో నోటి సంరక్షణకు సంబంధించిన అవగాహన ఎంతో అవసరమని ఎన్ఎంఆర్ డెంటల్ కళాశాల దంత డాక్టర్లు అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు ఈ కళాశాల దంత వైద్యబృందం బోధి పాఠశాలలో విద్యార్థులకుఅవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దంత వైద్యులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ నసీమున్,డాక్టర్ స్రవంతి,డాక్టర్ స్నేహికలు మాట్లాడుతూ నేడు మారుతున్న వాతావరణంలో నోటి శుభ్రత,దంత రక్షణ ఎంతో అవసరం అన్నారు. పసిపిల్లల్లో అవగాహనతో రోగాల బారి నుంచి కాపాడవచ్చునన్నారు. నేడు ప్రభుత్వం ఇందుకు ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు ఉదయం రాత్రి దంతాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఉదయం నిద్రలేస్తునే బ్రష్ చేసుకోవాలని రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు మరో సారి బ్రష్ చేసుకుంటే నోటిలో చేరిన క్రిములు నశిస్తాయన్నారు.ఏర్పాట్లును పాఠశాల ప్రిన్సిపల్ బి.లింగయ్య పర్యవేక్షించారు. విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో విద్యార్థులు,ఉపాధ్యాయులకు దంత పరీక్షలు,నోటి ఆరోగ్యంకు సంబంధించి అపోహలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా దంత పరిజ్ఞానాన్ని మెరుగు పరిచే క్రాస్ పజిల్,మైండ్‌బాడీ కో- ఆర్డినేషన్ ఆటలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా ఎన్ఎంఆర్ డెంటల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్ర ఎస్.వి.,బ్రహ్మకుమారిస్ బ్రదర్ బి.కే. జగదీష్ హాజరై సూచనలు చేసారు. పాఠశాల నిర్వాహకులు చక్కటి ఏర్పాట్లు చేసి అవగాహన కల్పించుటకు సహాకరించటం ముదావహం అన్నారు. తమ కళాశాల పాఠశాల నిర్వాహకులు కోరితే ఉచిత దంత వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు.ఈ సందర్భంగా వారు దంతాలను ఎలా రక్షించుకోవాలి, ప్రమాదాలు జరిగినపుడు జరిగే నష్టాలను ఎలా సరిచేసుకోవాలి అనే అంశాలపై చక్కగా అవగాహన కల్పించారు. బాలల దినోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు పలు గ్రామీణ పాఠశాలల్లో తమ వైద్యబృందం పర్యటించి అవగాహన కల్పించటం వారిలోనే సామాజిక బాధ్యతకు నిదర్శనం అని అభినందించారు. ఈ సందర్భంగా దంతాలను కాపాడుకుందాం,నోటిని పరిరక్షించుకుందాం అనే నినాదాలతో సంగారెడ్డి వీధుల్లో ర్యాలిని నిర్వహించారు.ఈ ర్యాలిలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాల్లో ఎన్ఎంఆర్ కళాశాల దంత వైద్యులు, పిజి విద్యార్థులు పాల్గొన్నారు.


సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మెదక్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న కేసీఆర్, హాజరైన ప్రజలు

# సంక్షేమంలో మనం ఇండియాలోనే నెంబర్‌వన్

### కారు గుర్తుకు ఓటేసి మెదక్ ఎమ్మెల్యేగా పద్మాదేవేందర్‌రెడ్డిని గెలిపించండి

### మెదక్ సభలో సీఎం కేసీఆర్

**సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 15, ప్రభాతవార్త :** సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, వాటిని అమలు చేసే విషయంలో తెలంగాణ భారతదేశంలేనే నెంబర్‌వన్‌గా ఉందని సీఎం కేసీఆర్ అన్నారు. బుధవారం నాడు మెదక్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు ఆయన హాజరయ్యారు. మరోసారి కారు గుర్తుకు ఓటేసి మెదక్ ఎమ్మెల్యేగా పద్మాదేవేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అభ్యర్థుల చరిత్రను చూడాలని, దానికంటే ముఖ్యంగా పెద్ద పార్టీలున్నాయని, ఆ పార్టీల చరిత్ర, వైఖరి, నడవడిక, పార్టీకి అధికారం ఇస్తే ఏం చేశారు ?, ఏం చేయలదనేది గనించాలని కోరుతున్నాని అన్నారు. పార్టీల నడవడికను పరిశీలిస్తే మంచిచెడు తెలుస్తుందని పేర్కొన్నారు. ఓటు మంచివాళ్లకు వేస్తే మంచి జరగుతుందని తెలిపారు. ఈ నెల 30 తారీఖున ఎట్లయిన ఓట్లు పడుతయ్, జనవరి 3న లెక్కపెడుతరు, ఆడికే అయిపోదు కథ...ఇక్కడ ఏ ఎమ్మెల్యే గెలిస్తే హైదరాబాద్‌లో ఆ ప్రభుత్వం ఏర్పడుతుందని తనదైన శైలిలో అన్నారు. ఓటు అనేది తలరాతను రాస్తుందని, జాగ్రత్తగా ఆలోచించి వేస్తే లాభం జరిగే అవకాశం ఉంటుందని, లేకపోతే ఆటటే కాటేసే అవకాశం ఉందన్నారు. బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ రాష్ట్ర సాధన, తెలంగాణ ప్రజల హక్కుల సాధన కోసమని అన్నారు. ఈ విషయం మీకు తెలుసన్నారు. బీఆర్ఎస్ మీముందే పుట్టింది...ప్రభుత్వంగా పనిచేసిందని అన్నారు. కాంగ్రెస్‌కు 50 ఏళ్ళ చరిత్ర ఉన్నదని, కానీ తెలంగాణ వచ్చిన సమయంలో గందరగోళమైన పరిస్థితులుండే...అవన్నీ సరిచేసి పదేళ్లలో బీఆర్ఎస్ ఏం చేసిందో మీకండ్లముందన్నదని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, కరెంటు, రైతులు, సాగునీరు, పరిశ్రమలు, ఐటీరంగం వీటిపై దృష్టిపెట్టి పని చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమని తెలిపారు. సంక్షేమంలో మనం ఇండియాలోనే నెంబర్‌వన్ అని, మనకు ఎవరూ సాటిలేరని, చాలా అద్భుతమైన సంక్షేమం ఇస్తున్నామని అన్నారు. రైతుల గురించి ఆలోచిస్తే ఐదు కార్యక్రమాలను తీసుకున్నామన్నారు. గతంలో ఇదే మెదక్‌కు వచ్చిన సందర్భంలో నీటితీరువా బకాయిలు ఉన్నాయని, రైతులు బాధపడుతున్నారని, వాటిని మాఫీ చేయాలని అప్పటి కలెక్టర్ చెప్పారని గుర్తుచేశారు. అంతే కాకుండా మామంత్రి హరీష్ రావు చెపిందని, వాటిని రద్దు చేశామన్నారు. నీళ్లకు ట్యాక్స్‌లేదు, ఘనపురం ఆనకట్ట ద్వారా తీసుకున్న నీళ్లకు ట్యాక్స్‌లేదు, కాళేశ్వరం నీళ్ల వచ్చినా ట్యాక్స్‌లేదు, మంచి నాణ్యమైన కరెంటు 24 గంటలు ఉచితంగా ఇస్తున్నాం, రైతుబంధు పెట్టుబడి ఇస్తున్నాం, పండించిన ధాన్యాన్ని నష్టం వచ్చినా ప్రభుత్వమే కొంటున్నది, రైతుబీమా అందజేస్తున్నాం అని పేర్కొన్నారు. కానీ మీరు జాగ్రత్తగా ఓటు ఆలోచించి వేయకపోతే పెద్ద ప్రమాదం వచ్చే అవశాశం ఉన్నదంటూ హెచ్చరించారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు కూడా వేస్టఅని, కేసీఆర్ డబ్బులన్నీ దండగ చేస్తున్నాడని మాట్లాడుతున్నారన్నారు. మరి 24 గంటల కరెంటు వేస్తా...? అని అడిగారు. పీసీసీ అధ్యక్షుడు మా ట్లాడుతున్నడు మూడు గంటల కరెంటు సరిపోతుం దంటా..! మూడు గంటలకు కనీసం మడి తడుస్తుందా...? దానికి ఆయన చెప్పే సిద్దాంతం..మూడు గంటల కరెంటు చాలూ....పది హెచ్‌పీల మోటర్ పెట్టుకోవాలట...! మరి రైతుల దగ్గర పది హెచ్‌పీల మోటర్ ఉందా...? 3 లేదా 5 హెచ్‌పీల మోటర్లు మన దగ్గర ఉంటాయని, మరి రైతుల దగ్గర ఉన్న 30 లక్షల మోటార్లు మార్చాలంటే డబ్బుడు ఎవ్వడు ఇవ్వాలి...? అని కేసీఆర్ ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో మంత్రి హరీష్‌రావు, స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, జడ్పీ చైర్మెన్ హేమలతశేఖర్‌గౌడ్, వెంకట్‌రామ్‌రెడ్డి, సీనీయర్ నాయకులు శశిధర్‌రెడ్డి, ఏకే. గంగాధర్, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, సరాఫ్ యాదగిరి,రైతు సంఘం అధ్యక్షులు సోములు, మున్సిపల్ చైర్మెన్‌లు తొడుపునూరి చంద్రపాల్, పల్లె జితేందర్‌గౌడ్, వైస్ చైర్మెన్ మల్లిఖార్జునగౌడ్, నాయకులు రాగి అశోక్, గజవాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు నర్సాపూర్‌లో బిఆర్ఎస్ ప్రజాఆశీర్వాద బహిరంగ సభ


బిఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి,సునీతారెడ్డి

**నర్సాపూర్, నవంబర్ 15, ప్రభాతవార్త:** నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో బాగంగా నేడు గురు వారం నర్సాపూర్‌లోబిఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభను నిర్వహిస్తున్నారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర మంత్రి హరీష్‌రావు బహిరంగ సభకు జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి,లేబర్ వేల్ఫేర్ బడోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వెంకటట్రామ్‌రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు సలహాలను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ నర్సాపూర్‌చరిత్రలో ఎన్నడు లేని విధంగా కనివిని ఎరుగని రీతిలో నర్సాపూర్‌లో ముఖ్య మంత్రి కెసిఆర్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభను నిర్వహించాలని అన్నారు. నర్సాపూర్ నుండి వెల్దుర్థి వెళ్ళె మార్గంలో ముఖ్యమంత్రి కెసిఆర్ నిర్వహించే ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి హరీష్‌రావు పరిశీలించారు. నర్సాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీకి కంచు కోటని అన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థి సునీతా రెడ్డి సున్ని తమైన మంచి మనస్సుగలదని దీంతో నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ గెలుపును ఏశక్తి ఆపలేదన్నారు. ఈ బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాలిఅనిల్‌కుమార్ వారిశ్రేణులు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగాయిపల్లి గోపి వారి శ్రేణులు బిజెపి నాయకులు పెద్ద ఎత్తున ఆయా పార్టీలకు రాజీనామాలు చేసి ముఖ్యమంత్రి కెసిఆర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని మంత్రిహరీష్ రావువెల్లడించారు. ఈమేరకు నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఈ బహిరంగ సభ ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర లేబర్ వేల్ఫేర్ బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డి తో పాటు జిల్లా గ్రంధాలయాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా కో ఆప్షన్ సభ్యులు మన్సూర్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అశోక్‌గౌడ్,ఫైడి శ్రీధర్‌గుప్త, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంక ట్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ రాజుయాదవ్,బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బోగచంద్ర శేఖర్, నాయకులు మాచునూరి మల్లేష్‌యాదవ్, బిక్షపతి, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## లీడర్,క్యాడర్ లేని టూరిస్టులను నమ్మిమోసపోవద్దు

### ప్రతిపక్ష పార్టీ నాయకులకు తమ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో చెప్పే దమ్ముందా...!?

### ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్

**హుస్నాబాద్‌రూరల్,నవంబరు15,ప్రభాతవార్త :** లీడర్లు,క్యాడర్ లేని కాంగ్రెస్, బిజెపి నాయకుల మాయ మాటలు నమ్మి ఓట్లు వేసి మోసపోవద్దని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి,సిట్టింగ్ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ అన్నారు.మంగళవారం రాత్రి హుస్నాబాద్ పట్టణంలోని 2,7,14,17వ వార్డుల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సంర్బంగా ఆయ వార్డులో ఇంటింటికి తిరిగి వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారానికి వచ్చిన సతీష్‌కుమార్‌కు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టడంతో మంగళహారతులు, కోలాటం ఆటలు,బతుకమ్మలు, బోనాలతో స్వాగతం పలికి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరిస్తూ మద్దతు పలికారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ 2014కు ముందు వెనుకబడి ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు అభివృద్ధికి చిరునామాగా మారిందన్నారు.సిఎం కేసీఆర్ పాలనలో వేల కోట్లు తీసుకువచ్చి అభివృద్ధి చేశానని జరి గిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన నూతన మ్యానిఫెస్టోకు ప్రజల నుండి మంచి స్పందన లభిస్తోందన్నారు.మరోసారి అధికారంలోకి రాగానే కేసీఆర్ భీమా ద్వార రేషన్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి 5లక్షల భీమా సౌకర్యంతో పాటు అన్నపూర్ణ పథకం ద్వార సన్న బియ్యం పంపిణీ,ఆసరా ఫించన్ల పెంపు,రైతు బంధుపెంపు,మహిళా సమైఖ్యతకు సొంత భవనాలు,అనాధ పిల్లలకు ప్రత్యేక పాలసీ, జర్నలిస్టులకు నగదు రహిత వైద్యబీమా,సౌభాగ్యలక్ష్మి పథకం ద్వార ప్రతీ మహిళకు 3వేలు జీవన బృతి,400లకే గ్యాస్ సిలిండర్, అగ్రవర్ణ పేదలతో పాటు అన్ని దర్గాల ప్రజలకు ప్రత్యేక గురుకులాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.ఈ ప్రాంతంలో ఉన్న మైనార్టీ గురుకుల జూనియర్ పాఠశాలను డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తామని,అసైండ్ భూములపై ఉన్న ఆంక్షలను తొలగిస్తామన్నారు.ప్రత్యేక రాష్ట్రంలో చెప్పిన పనులతో పాటు చెప్పని హామీలను సైతం చేశామని మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. స్వతంత్ర్యం వచ్చినప్పటినుండి పాలిస్తున్న కాంగ్రెస్, బిజెపిలు రాష్ట్రానికి ఒరగబెట్టిందేమిలేదన్నారు. తమ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి కేసీఆర్ అని దమ్ముంటే వారి పార్టీలలో ముఖ్యమంత్రి అభ్యర్థులు ఎవరో చెప్పాలని సవాలు విసిరారు.బిజెపి,కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న,వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి,పార్టీ పట్టణ అధ్యక్షులు వాహబ్ అన్వర్, కౌన్సిలర్లు బోజు రమాదేవి రవిందర్,వాల సుప్రజ నవీన్‌రావు, బొల్లి కల్పన శ్రీనివాస్‌తో పాటు కోఆప్షన్ సభ్యులు అయిలేని శంకర్‌రెడ్డి,ఎండి అయూబ్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్న గాలి అనిల్‌కుమార్

## కాంగ్రెస్ పార్టీకి గాలి అనిల్‌కుమార్ రాజీనామా

### త్వరలోనే భవిష్యత్తు ప్రకటిస్తా

**రామచంద్రాపురం, నవంబరు 15, ప్రభాతవార్త:** ఉమ్మడి టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మెదక్ పార్లమెంట్ ఇంచార్జి గాలి అనిల్‌కుమార్ కాంగ్రెస్ పార్టీకి బుధవారం రాజీనామా చేశారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పట్టణం అశోక్ నగర్‌లో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను నమ్ముకుని ఇన్నాళ్లు సేవలు అందించానని, పైసల్ ఖర్చు చేసుకుని పార్టీ కోసం పనిచేశానని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలోకి బిసిలకు పూర్తిగా అన్యాయం జరిగిందని వాపోయారు. గత ఎన్నికల్లో టికెట్ ఇస్తానంటే కాంగ్రెస్ పార్టీలో చేరానని, నాడు నేడు తనకు పార్టీ టికెట్ కేటాయించకుండా అన్యాయం చేసిందని మండిపడ్డారు. ఎఐసిసి నాయకులు తనను సంప్రదించినా రాష్ట్ర నాయకులు మాత్రం తమను పట్టించుకోకుండా దూరదూరంగా ఉంటూ వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజీనామాను ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్‌ఖర్గే, పార్టీ అధినాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డిలకు ఫ్యాక్స్ ద్వార రాజీనామాపత్రాన్ని పంపినట్లు పేర్కొన్నారు. మరో రెండు రోజుల్లో తన కార్యచరణను ప్రకటిస్తామన్నారు. సమావేశంలో నర్సాపూర్ ఎంపిపి జ్యోతి సురేష్ నాయక్, నర్సాపూర్ బ్లాకన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సాపూర్ మండల మైనార్టీ అధ్యక్షులు అజమత్ అలీ, నాయకులు నర్సింగ్‌రావు, అన్వర్, హఫీజ్, సొకత్, సమీ, ఫయాజ్, అబ్బాస్, మాసమ్, జుబ్బా యిర్, తన్వీర్, అఫ్రోజ్, నరేష్, ఉగ్గే శ్రీనివాస్, ఆవుల రమేష్, ఆకుల యాదయ్య, బత్తుల రాములు పాల్గొన్నారు.

## టిఎస్ఎస్ జిల్లా కళాకారులపై సస్పెన్షన్ వేటు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబరు 15, ప్రభాతవార్త:** టిఎస్ఎస్ జిల్లా కళాకారులు ఎన్ స్వప్న, యు భవాని, స్ మల్లేష్‌లపై సస్పెన్షన్ వేటు పండింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన తెలంగాణ సాస్కృతిక సారధి జిల్లా కళాకారులు ఎన్ స్వప్న, యు భవాని, స్ మల్లేష్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల నాటి నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వస్తుందని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కళాకారులు ఎలాంటి రాజకీయ ప్రచార కార్యక్రమాల్లో, ఊరేగింపులు, వేదికలలో పాల్గొనకూడదని, ఏ రాజకీయ పార్టీకి ప్రచారం చేయరాదని ఆదేశాలు ఉన్నా ఆదేశాలను, ఎన్నికల ప్రవర్తన నియమావళిని దిక్కరిస్తూ ప్రచారంలో పాల్గొని పాటలు పాడినట్లు రుజువవడంతో ముగ్గురిపై సస్పెన్షన్ విధించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

## జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 95 మంది అభ్యర్థులు

### గజ్వేల్ 44, సిద్దిపేటలో 21, హుస్నాబాద్‌లో 19, దుబ్బాకలో 11

### గుర్తులను కేటాయించిన ఎన్నికల అధికారులు

### గజ్వేల్‌లో పోటీ నుంచి తప్పుకున్న 70 మంది స్వతంత్రులు

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి :** శాసనసభ ఎన్నికల్లో భా గంగా నామినేషన్ల ఉపసంహరణ గడువు బుధవారం మ ధ్యాహ్నం 3 గంటల వరకు ఉండడంతో జిల్లాలోని సిద్దిపే ట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక నియోజకవర్గాల్లో స్వ తంత్రులుగా నామినేషన్లు వేసిన వారిని పోటీ నుంచి త ప్పించడానికి ఆయా రాజకీయ పార్టీల నేతలు బుజ్జగింపులు చేశారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాలలో స్వతం త్రులుగా నామినేషన్ దాఖలు చేసిన పలువురు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. గజ్వేల్‌లో అత్యధి కంగా నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ అనుహ్యంగా పెద్ద సంఖ్యలో స్వతంత్రులు పోటీ నుంచి తప్పుకున్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు గానూ స్వతంత్రు లు బరిలో నుంచి తప్పుకొగా 95 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. సిద్దిపేట అసెంబ్లీ స్థానంకు గానూ 39 మంది నామినేషన్లు దాఖలు చేయగా రెండు తిరస్కర ణకు గురికాగా 16 మంది ఉపసంహరించుకున్నారు. కాగా 21 మంది బరిలో నిలిచారు. బిఆర్ఎస్ నుంచి మంత్రి తన్నీరు హరీష్‌రావు, బిజెపి నుంచి దూది శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి పూజల హరికృష్ణ, బిఎస్పి నుంచి చక్రధర్ గౌడ్‌లతో పాటు మరో 17 మంది బరిలో ఉన్నారు. గజ్వే ల్ నుంచి అత్యధికంగా 127 మంది నామినేషన్లు దాఖలు చేయగా 13 నామినేషన్లు తిరస్కరించగా 114 మందికి గా నూ 70 మంది తమ నామినేషన్లు ఉపసం హరించు కున్నారు. దీంతో బరిలో 44 మంది నిలిచారు. బిఆర్ఎస్ నుంచి సిఎం కెసిఆర్, కాంగ్రెస్ నుంచి తూంకుంట నర్సారెడ్డి, బిజెపి నుంచి ఈటల రాజేందర్ బరిలోకి దిగారు. మిగితా 41 మంది స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచారు. స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల అధికారి గుర్తులను కేటాయిం చారు. హుస్నాబాద్ నుంచి 36 మంది నామి నేషన్లు దాఖలు చేయగా రెండు పరిశీలనలో 2 తిరస్కరణ కు గురియ్యాయి. మిగితా 34 మందిలో 15 మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకోగా 19 మంది బరిలో ఉన్నారు. బిఆర్ఎస్ నుంచి తాజా మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్, కాంగ్రెస్ నుంచి పొన్నం ప్రభాకర్, బిజెపి నుంచి బొమ్మ శ్రీరాంచక్రవర్తితో పాటు 16 మంది వివిధ పార్టీలు, స్వతంత్రులుగా బరిలో నిలిచారు. దుబ్బాక నియోజక వర్గం నుంచి 22 మంది నామి నేషన్లు దాఖలు చేయగా ఒకరు పరిశీలనలో 7 తిరస్కరణకు గురి కాగా 4 నామినేషన్ ఉపసంహరించుకున్నారు. బరిలో 11 అభ్యర్థులు ఉన్నారు. బిఆర్ఎస్ నుంచి కొత్త ప్రభాకర్‌రెడ్డి, కాం గ్రెస్ చెరుకు శ్రీనివా స్‌రెడ్డి, బిజెపి నుంచి తాజా మాజీ ఎమ్మెల్యే రఘునం దన్‌రావు, మరో 8 మంది వివిధ పార్టీలతో పాటు స్వంతత్రు లుగా పోటీ పడుతున్నారు. స్వతంత్ర అభ్యర్థులకు ఆయా నియోజకర్గాలకు చెందిన ఎన్నికల అధికారులు గుర్తులను కేటాయించారు.

# ఖైరతాబాద్‌లో స్పీడ్ తగ్గిన కారు

**ప్రచారానికి స్పందన కరవు.. బిఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ పాదయాత్రలకు, సమావేశాలకు ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో వెల వెలబోతున్నాయి. పలువురు కార్పొరేటర్లు సైతం మీదికి ప్రచారంలో కనపడుతున్నా ఆతర్వాత ఎమ్మెల్యేని పట్టించుకోవడం లేదు. ఎవరైనా అగ్రనాయకులు నియోజకవర్గానికి వస్తే అలా కనిపించి ఇలా వెళ్ళిపోతున్నారు. దీంతో జనం నుంచి స్పందన లేకపోవడంతో కొంత మంది దళారులను రంగంలోకి దించి ప్రచారం కోసం ఒక్కొక్కరికి 500 నుంచి 1000 ఇచ్చి ఎన్నికల ప్రచారానికి తీసుకు వస్తున్నారు. ఈ నెల 30న ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల ప్రచారంలో దూసుకు వెళ్ళాల్సి ఉండగా ఏమాత్రం ఉత్సాహం కార్యకర్తల్లో కనిపించడంలేదు. దీంతో దానం గెలువడం అంత సులభం కాదని పలువురు పేర్కొంటున్నారు.**



**బిఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఎదురీత**

**ఒంటెద్దు పోకడలు, భజనపరుల తీరుతో తిప్పలు**

**కాలనీలు, బస్తీల్లో తీవ్రమైన వ్యతిరేకత**

**ప్రశ్నించిన వారిపై అనుచరులతో భౌతిక దాడులు**

హైదరాబాద్, నవంబరు 15 ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్ నియోజకవర్గంలో అత్యంత కీలకమైన ఖైరతాబాద్ నియోజక వర్గంలో ఎన్నికలు వేడెక్కాయి. ఖైరతాబాద్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ ఒంటెద్దు పోకడలు, భజన పరుల వ్యవహార శైలితో కారు స్పీడ్ తగ్గిందా అంటే ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే నిజమని అనిపిస్తుంది. తానే గెలుస్తాననే అతి ధీమాతోపాటు నాయకులు, కార్యకర్తల్లో సమన్వయం లోపం గ్రూపు తగాదాలతో దానం ఎదురీదుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఖైరతాబాద్ నియోజకవర్గంలో బిఆర్ఆర్ఎస్ క్రమక్రమంగా పట్టు కోల్పోతోందని ప్రచారం జరుగుతోంది. దీంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న నాయకులు, కార్యకర్తలు ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. గతంలో ఇక్కడ గెలిచిన విధంగా అంత సులువుగా ఈ సారి దానం గెలవడం కష్టమని, ఇక్కడ నెలకొన్న పరిస్థితులను బట్టి చూస్తే అర్థమవుతోంది. అయితే ఇక్కడ దివంగత నేత మాజీ సిఎల్పీ నాయకుడు పిజెఆర్ కుమార్తె విజయారెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా, బిజెపి అభ్యర్తిగా చింతల రాంచంద్రారెడ్డి పోటీచేస్తుండడంతో ఇక్కడ గట్టి పోటీ నెలకొంది. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత దానం నాగేందర్ నియోజకవర్గ అభివృద్ధికి చేసింది ఏమి లేదని, ఎక్కువగా భూకబ్జాలకు పాల్పడటంతో పాటు, దళితబంధు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో తన అనుచరులకే అధికప్రాధాన్యత ఇచ్చి ప్రజల కష్టాలు పట్టించుకోలేదని ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు. ఎవరైనా దానంను స్థానికులు విమర్శిస్తే తన అనుచరులతో భౌతిక దాడులకు పాల్పడుతూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది.

**కొంప ముంచుతున్న భజన పరులు..** దానం నాగేందర్ చుట్టూ కొందరు భజనపరులు చేరి పార్టీ కోసం పాటుపడిన వారిని దగ్గరికి రానివ్వకుండా ఆయనకు లేనిపోనివి చెప్పి అభ్యర్థిని పక్కదారి పట్టిస్తున్నారు. తమకు నియోజకర్గంలో మంచి పట్టుఉందని, తాము చెబితే మైనారిటీలతోపాటు సెటిలర్లు, యువకుల ఓట్లు పార్టీకి పడుతాయని చెప్పి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. కార్యకర్తలను, ప్రజల్లో మంచి పట్టుఉన్న సీనియర్ నాయకులను దానం వద్దకు చేరకుండా ఉండేందుకు తమ జిమ్మిక్కులతో దానంని బురుడీ కొట్టిస్తూ భజన పరుల బ్యాచ్ హాల్‌చల్ చేస్తుంది.

**పిజెఆర్ ఓటు బ్యాంకుతో కష్టమే..** ఖైరతాబాద్ నియోజకవర్గంలో దివంగత పి.జనార్ధన్‌రెడ్డికి ఇప్పటికీ కొంత ఓటుబ్యాంకు ఉందనే నానుడి ఉంది. ఈనేపథ్యంలో ఇక్కడ ఆయనకుమార్తె విజయారెడ్డి కాంగ్రెస్‌నుంచి బరిలో నిలవడం కూడా దానం నాగేందర్‌కు నష్టం చేకూర్చుతుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

## సమాజం కోసం పాటుపడిన వారిని స్మరించుకోవడం మనందరి బాధ్యత : రమణాచారి

నాంపల్లి, నవంబరు 15 ప్రభాతవార్త : డా. ఎం.ఎల్.నరసింహారావు ఒక రచయిత, కవి, అధ్యాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, వివిధ దృక్పథాలు కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి, పట్టుదల, క్రియాశీలత, కార్యదక్షత, దీక్షకు మారుపేరైనా, భాషానిలయాన్ని అన్నివిధాలా కాపాడడానికి తన శాయశక్తులా కృషిచేసి నిలబెట్టడం ఒక యెత్తయితే సమాజహితం కోసం పాటుపడిన తీరు మరువరానిదని, ఇలాంటి వారిని ఎల్లవేళలా స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని, ఆయన జయంతిరోజున మహోన్నత కార్యక్రమాలు నిర్వహిస్తున్న కుటుంబసభ్యులను, భాషానిలయం నిర్వాహకులను తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అభినందించారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషానిలయం ఆధ్వర్యంలో రావిచెట్టు రంగారావు సభామందిరంలో జరిగిన డా. ఎం.ఎల్.నరసింహారావు జయంతిసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు డా. ఎస్వీ రామారావు, బి.ఆర్.రావు, కె.చంద్రప్రకాష్ రావు, టి.ఉదయవర్లు తదితరులతో కలిసి ప్రముఖ రచయిత, కవి ప్రాణ్‌రావుకు డా. ఎం.ఎల్.నరసింహారావు సాహితీ సేవాపురస్కారం బహూకరించి, ఆయన రచించిన తరతరాల తెలుగు ప్రముఖులు గ్రంథాన్ని ఆవిష్కరించారు.



ప్రాణ్‌రావుకు నరసింహారావు సాహితీ సేవాపురస్కార మందిస్తున్న రమణాచారి, రామారావు, ఉదయవర్లు తదితర అతిథులు

# యూనివర్సిటీల సమస్యలపై డిక్లరేషన్ చేయాలి

తార్నాక, నవంబర్ 15 ప్రభాతవార్త: యూనివర్సిటీల సమస్యలపై డిక్లరేషన్ చేయాలని తెలంగాణ యూనివర్సిటీల జేఏసీ నాయకులు సీమర్ల విజేందర్ రెడ్డి, ఎ. అశోక్, రామలింగయ్య కోరారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట విద్యార్థులు,ప్రొఫెసర్లు డిక్లరేషన్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీల జేఏసీ నాయకులు సీమర్ల విజేందర్ రెడ్డి, ఎ. అశోక్, రామలింగయ్య మాట్లాడుతూ యూనివర్సిటీలు, అందులో పనిచేసే ఉద్యోగుల గురించి ఆయా రాజకీయ పార్టీలు తమ సమస్యలపై తమ తమ రాజకీయ మాని ఫెస్టోలో చేర్చాలని కోరారు. యూనివర్సిలల్లో చదివే విద్యార్థులకు ఉచిత విద్య, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులన్నింటిని రెగ్యులరైజ్ కోర్సులుగా మార్చాలని, వర్సిటీలల్లో రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. అదేవిదంగా యూనివర్సిటీలల్లో పనిచేస్తున్న పర్మినెంట్ ప్రొఫెసర్లకు, ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్‌లను అమలు చేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, 7వ సవరణ పేస్కేల్ బకాయిలను చెల్లించాలని, యూనివర్సిటీలకు బ్లాక్ గ్రాంట్స్‌ను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎండీ.ఖాన్, ఓంకార్, నాగవేణితో పాటు పలువురు పాల్గొన్నారు.



డిక్లరేషన్ చేయాలని కోరుతూ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట విద్యార్థులు,ప్రొఫెసర్లు

# అభివృద్ధిని చూసి అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఓటేయండి

**శేరిలింగంపల్లి బిఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ**

**బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి నియోజకవర్గంలో ముమ్మర ప్రచారం**



బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారంలో శేరిలింగంపల్లి అభ్యర్థి ఆరెకపూడి గాంధీ

సైబరాబాద్ ప్రతినిధి, నవంబరు 15 ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో గత తొమ్మిదిన్నరేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని చూసి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి ఓటువేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ స్థానిక ప్రజలకు పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి అభివృద్ధి కోసం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 9వేల కోట్ల రూపాయల నిధులతో పనులు చేపట్టామని, బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి శేరిలింగంపల్లి ప్రజలు హ్యాట్రిక్ విజయాన్ని కట్టబెట్టేందుకు సిద్దంగా ఉన్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నానక్‌రాంగూడలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానికంగా ఉన్న రంగనాథస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో స్థానిక కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డితో కలిసి పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి ప్రచారం కొనసాగించారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ ఏ బ్లాక్‌లో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి అరెకపూడి గాంధీ కుమారుడు పృథ్వీ, కోడలు భార్గవి, కుమార్తె ప్రణీతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సాయంత్రం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన కాలనీలో కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నె శ్రీనివాసరావులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, తాము చేసిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించి, మరోసారి ఓటువేసి గెలిపించాలని కోరారు. నేడు తెలంగాణ రాష్ట్రం సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా ఉందని, ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బిఆర్ఎస్ పార్టీని తెలంగాణ రాష్ట్రంలో, శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మరోసారి అధికారంలోకి తీసుకువస్తాయన్నారు. ఆడపిల్ల పుట్టిన దగ్గరి నుంచి పెళ్లి వరకు ఓ పెద్దన్న మాదిరిగా ముఖ్యమంత్రి కెసిఆర్ పేద కుటుంబాలను ఆదుకుంటున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల కోసం అందజేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిగా అర్హులైన లబ్దిదారులకు అందజేస్తున్నామని తెలిపారు. శేరిలింగంపల్లిలో మరోసారి బిఆర్ఎస్ జెండాను ఎగురవేసేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని, అత్యధిక మెజారిటీతో పార్టీని గెలిపించి, ముఖ్యమంత్రికి కానుకగా అందించేందుకు బిఆర్ఎస్ శ్రేణులు సన్నద్ధమయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అప్రమత్తతోనే ఊపరితిత్తులు సురక్షితం

**నిమ్స్ పల్మనాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ పరంజ్యోతి**



హైదరాబాద్, నవంబర్ 15,ప్రభాతవార్త: అప్రమత్తంగా ఉంటేనే ఊపిరిత్తితులను సురక్షితంగా ఉంచుకునేందుకు అవకాశం ఉంటుందని నిమ్స్ ఆసుపత్రి ఆల్మనాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ పరంజ్యోతి అన్నారు. అంతర్జాతీయ క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిజీస్ (సిఓపిడి) దినోత్సవం సందర్భంగా బుధవారం ఆసుపత్రిలోని అత్యవసర విభాగం ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గాలి కాలుష్యం, దుమ్ము, ధూళి కారణంగానే ఎంతో మంది ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్నట్లు చెప్పారు. గతంతో వృద్దుల్లో ఈసమస్య ఎక్కువగా ఉంటే..ఇప్పుడు 35నుంచి 40ఏళ్ల వారిలో కూడా పెగుతుందన్నారు. ఈసమస్య ఉన్న ప్రతివందమందిలో 30శాతం మందిలో తీవ్రత ఎక్కువగా ఉందని నివారణకోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలుష్య వాతావరణానికి దూరంగా ఉండటంతోపాటు స్వచ్ఛమైన గానిలిని తీసుకునేలా జాగ్రత్తలు తీసుకుంటే ఈవ్యాధికి దూరంగా ఉండొచ్చునని సూచించారు. ఈకార్యక్రమంలో ఇంఛార్జ్ డీన్ ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, అసోసియేట్ డీన్ డాక్టర్ సాయిబాబా, ప్రొఫెసర్ పద్మజా, సీనియర్ వైద్యులు,వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## పోటాపోటీగా ప్రచారాలు

**నియోజవర్గాల్లో దూసుకుపోతున్న ప్రధానపార్టీలు**

**హైదరాబాద్‌జిల్లాలో బరిలోనిలిచిన 312 మంది అభ్యర్థులు**

**మేడ్చల్ మల్కాజ్‌గిరిలో 126 మంది పోటీ**

**మేడ్చల్‌లో అత్యధికంగా 64మంది స్వతంత్రుల ఉపసంహారణ**

హైదరాబాద్, నవంబరు 15 ప్రభాతవార్త: హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా పరిధిలోని 26 నియోజకవర్గాలకు సంబంధించి దాదాపు ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులను ప్రకటించడం, నామినేషన్‌లు కూడా వేయడంతో ఒక ప్రజాక్షేత్రంలో అభ్యర్థులు తలపడేందుకు ముందుకు వచ్చారు. మరోవైపు ఓటర్లను ఆకర్షించేలా ర్యాలీలు, సభలు, సమావేశాలు, ప్రసంగాలు చేయబోతున్నారు. ఎన్నికలకు మరో 14 రోజుల సమయం మాత్రమే ఉండడంతో, తమనే గెలిపించాలని రాజకీయ పార్టీల అభ్యర్థులు వేడుకుంటున్నారు. ఇక ప్రజాపర్వంలో ఇప్పటికే అధికార బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులు రెండు దఫాలుగా ప్రచారం చేసుకున్నారు. కాగా నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో 332 నామినేషన్లకు గానూ 20మంది ఉపసంహరించుకోగా మొత్తం 312మంది బరిలో నిలిచారు. ఇందులో అత్యధికంగా నాంపల్లినుంచి 34మంది బరిలో నిలవగా కంటోన్మెంట్ నుంచి 10మంది బరిలో ఉన్నారు. అలాగే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని 5నియోజవర్గాల్లో 261 నామినేషన్లు రాగా 64మంది స్వతంత్రులు ఉపసంహరించుకోగా 126మంది బరిలో నిలిచారు. ఇందులో మేడ్చల్ నియోజకవర్గం నుంచి 45మంది స్వంతత్రులు తమ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు.

## మానవాళికి ధైర్యాన్ని, గమన గమ్యాలను నిర్దేశించే రచనలు చేయాలి


**తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షుడు అల్లం నారాయణ**

నాంపల్లి, నవంబరు 15 ప్రభాతవార్త : ప్రపంచానికి రచయితలు చాలా అవసరమని, మానవాళికి ధైర్యాన్ని, గమనాన్ని, గమ్యాన్ని నిర్దేశించే విధంగా రచయితలు తమ రచనలు చేయాలని తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షుడు అల్లం నారాయణ అభిప్రాయపడ్డారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విస్తరణ సేవావిభాగం హైదరాబాద్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు సభాధ్యక్షతన విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో బుధవారం 2021 సంవత్సరానికి తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాల రచయితలకు సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం వైభవోపేతంగా జరిగింది.

## మాయమాటలతో మోసం చేసే కాంగ్రెస్, బిజెపీ పార్టీలకు బుద్ధి చెప్పాలి

**మంత్రి తలసాని**

అడ్డగుట్ట, నవంబర్ 15 ప్రభాతవార్త: కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేసే కాంగ్రెస్, బిజెపీ పార్టీలకు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని సనత్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో అమీర్‌పేట్ డివిజన్ బాపూ నగర్‌కు చెందిన యాధిలాల్, అంజద్, కరన్ సింగ్, తరణ్‌ల ఆధ్వర్యంలో 15 మంది యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి వారికి బిఆర్ఎస్ కండువకప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బాపూనగర్ అధ్యక్షుడు హర్షింగ్ పాల్గొన్నారు.



బిఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులను అభినందిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

**బిఆర్ఎస్ అభ్యర్థి లాస్యను భారీ మెజార్టీతో గెలిపించాలి : మంత్రి తలసాని**

కంటోన్మెంట్ నియోజకవర్గంలో దివంగత ఎమ్మెల్యే సాయన్న చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన వారంతా బిఆర్ఎస్‌ను గెలిపించాలని రాష్ట్ర మంత్రి,ఎన్నికల ఇన్‌ఛార్జి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం బోయిన్‌పల్లిలో కంటోన్మెంట్ అభ్యర్థి లాస్య బిఆర్ఎస్ ముఖ్యనేత లతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ లాస్య విజయానికి కార్యకర్తలు, నాయకులు, మాజీ బోర్డు సభ్యులు,మార్కెట్ యార్డు కమిటీ ప్రతినిధులు, దేవాలయ కమిటీ ధర్మకర్తలు కృషి చేయాలన్నారు. గురువారం నుంచి ఎన్నికల ప్రచారం ఉధృతంగా చేపట్టాలన్నారు. బిఆర్ఎస్ కార్యకర్తలే పార్టీకి బలం,బలగమన్నారు. కార్యకర్తలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామన్నారు. గురువారం క్లాసిక్ గార్డెన్‌లో నియోజకవర్గం బూత్ లెవల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి,ఈ నెల 21న నియోజకవర్గంలో చేపట్టనున్న మంత్రి కేటిఆర్ రోడ్‌షో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బిఆర్ ఎస్ అభ్యర్థి లాస్య నందిత బేవరేజెస్ కార్పోరేషన్ ఛైర్మన్ గజ్జెల నాగేశ్, బిఆర్ఎస్ సీనియర్ నేత ఎం.ఎన్.శ్రీనివాస్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, నళిని కిరణ్, అనిత, లోకనాథం, పి.శ్యామ్,బిఆర్ఎస్ నాయకులు టీ.ఎన్.శ్రీనివాస్, ఆకుల హరిక్రిష్ణ, నివేదిత, సాయన్న సతీమణి గీత తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్‌ను హైటెక్‌సిటీకీ ధీటుగా అభివృద్ధి చేశాను

**బిఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్**



శంషాబాద్ మున్సిపల్ బిజెపి మహిళా అధ్యక్షురాలు పరమేశ్వరి నందీశ్వర్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నార్సింగి, నవంబర్ 15 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గంను హైటెక్‌సిటీకి ధీటుగా అభివృద్ధి చేశానని... చేసిన అభివృద్ధిని చూసి మరోమారు నన్ను ఆశీర్వదించాలని బిఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కోరారు. బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్, శంషాబాద్, గండిపేట మండలాల పరిధుల్లో స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి జోరుగా ప్రచారం చేశారు. బిజెపి, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బిఆర్ఎస్‌లో చేరారు. వారందరికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి ఫలాలు ప్రతీ గడపకు, గల్లీకి చేరాయన్నారు. గత ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని చేతల్లో చేసి చూపించామని, ఈ సారి మళ్లీ కారు గుర్తుకు ఓట్లేసి తనకు భారీ విజయంను కట్టబెట్టాలని ప్రజలను కోరారు. 2009.లో గండిపేట మండలంలో అన్నీ కుగ్రామాలుగా ఉండేవని, ఇప్పుడు హైటెక్‌సిటీని తలదన్నేలా అభివృద్ధి చెందాయన్నారు. ఈ అభివృద్ధి వెనుకాల సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల శ్రమ, నా కృషి దాగుందన్నారు. మీరిచ్చిన అధికారంతోనే రాజేంద్రనగర్‌ను వేగంగా అభివృద్ధి చేసుకున్నామని, మళ్లీ అవకాశం ఇస్తే మరింత అభివృద్ధిని సాధించి చూపిస్తానని తెలిపారు. సమైక్య పాలన సమయంలో సంక్రాంతి వచ్చిందంటే చాలు మంచినీటి కటకట ఏర్పడేదని, ఇప్పుడు ఇంటింటికి నల్లా కనెక్షన్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయడం జరుగుతుందని, మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించామన్నారు. అలాగే బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, కార్పోరేటర్లు తలారి చంద్రశేఖర్, పద్మావతి పాండు, సంతోషి రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, మాలతీ నాగరాజు, పద్మావతి పాపయ్య యాదవ్, సాగర్‌గౌడ్, అస్లాం, నిఖిలా సంగారెడ్డి తదితరులు ప్రకాశ్‌గౌడ్‌ను గెలిపించాలని జోరుగా ప్రచారం చేశారు. నార్సింగిలో మాజీ ఎంపిపి తలారి మల్లేష్, మండల అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా, సీనియర్ నేతలు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, గొల్ల నాగేష్ యాదవ్, మేకల ప్రవీణ్ యాదవ్, చైర్ పర్సన్ రేఖ యాదగిరి, వైస్ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్లు శివారెడ్డి, పత్తి శ్రీకాంత్, ఉషారాణి, అరుణజ్యోతి, గోపాల సునీత గణేష్, విజిత ప్రశాంత్ యాదవ్ తదితరులు కారు గుర్తుకే ఓట్లు వేయాలని ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు.


## వినోభా భావే చిత్రపటానికి నివాళ్లు



గన్‌ఫౌండ్రి,నవంబర్ 15ప్రభాతవార్త:భూధాన ఉద్యమ నాయకులు, ఆచార్య వినోభా భావే గొప్ప,జ్ఞాని, గోవుల పరి రక్షణ, ఆర్మనికులు,సామాజిక ఉద్యమ కారుడిగా దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్,గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి ఘనంగా శ్లాఘించారు.స్వాతంత్రం వచ్చిన తరువాత 1950లో దేశ వ్యాప్తంగా భూసమ్యను గురించి వాటి పరిష్కార దిశంగా భూధాన ఉద్యమాన్ని ప్రారంభించి 44లక్షలఏకరాలను భూస్వాముల నుంచి శాంతియుతంగా సేకరించి పేదలకు వంచిన గొప్ప మానవతవాది అని ప్రస్తుతించారు. బుధవారం నాంపల్లిలోని గాంధీజ్ఞాన్ ప్రతిష్టాన్ కార్యాలయంలో ఆచార్య వినోభా భావే వర్ధంతి కార్యక్రమంలో భాగంగా దివంతుడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈకార్యక్రమంలో గాంధేయ సంస్థల ప్రతినిధులు ఆచార్య సుబ్రమణ్యంవర్ల,యానాల ప్రభాకర్‌రెడ్డి, కె.సుబాష్‌చంద్ర, వైశంకర్‌రెడ్డి,కనకదుర్గా,స్వరూప, రాజాసింగ్,ప్రభు పాల్గొన్నారు.

**బోరబండ సైట్ 2లో అయ్యప్ప స్వాముల పూజలకు**

## ముస్తాబయిన్న శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం



యూసుఫ్‌గూడ, నవంబర్ 15, ప్రభాతవార్త : బోరబండ ఎన్ఆర్ఆర్‌పురం సైట్ 2లోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాముల కోసం ఉచితంగా అన్నదాన కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈనెల 16వ తేది నుంచి డిసెంబర్ 1 వ తేది వరకు అయ్యప్ప స్వాములందరికి ప్రతి రోజు పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆలయ అధ్యక్షులు జి.లక్ష్మణ్ గౌడ్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ పూజారులు గోపాల కృష్ణ, ప్రవీణ్, ఆలయ కమిటి సభ్యులు బాలకృష్ణ, కాశీరావు, విజయ్, సత్యనారాయణ, తివారి, నాగరాజు, సోమేష్, గోవింద్, శ్రీను, మధు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**జిటియస్ దేవాలయంలో..** వెంగళరావునగర్ జిటియస్ కాలనీ శ్రీవీరాంజనేయ భవాని శంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవాలయంలో ఈనెల 16తేది నుంచి అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవదాయ ధర్మధాయ శాఖ ఆలయ చైర్మన్ చిన్న రమేష్ తెలిపారు. 16వతేది గురువారం నుండి జనవరి 1వ తేది వరకు నిత్య అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

## రోడ్డు భద్రతపై డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి అవగాహన



రాణిగంజ్ బస్ డిపో డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది నుంచి మాట్లాడుతున్న ఏసీపీ శంకర్‌రాజు

బేగంపేట, నవంబరు 15, ప్రభాతవార్త : రోడ్డు బధ్రతపై ముఖ్యంగా డ్రైవర్లు,కండక్టర్లు,మరియూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలంటూ బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ ఏసీపీ జి.శంకరరాజు రాణిగంజ్ బస్ డిపో డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి ఏసీపీ శంకరరాజు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకరరాజు మాట్లాడుతూ 2022లో మొత్తం 3947 ప్రమాదాలు నమోదయ్యాయన్నారు.హైదరాబాద్‌లో 1031 ప్రమాదాలు జరగ్గా 112మంది మృతి చెందగా,956మంది గాయపడ్డారని అన్నారు. టీఎస్ ఆర్‌టీసీ బస్సులకు సంబంధించిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో 21మంది పాదచారులతో సహా మొత్తం 41మంది మరణించారు. మొత్తం మరణాలలో ఆర్టీసీ బస్సుల ప్రమేయం 13శాతం, సిగ్నల్ జంపింగ్ ,ఓవర్ స్పీడ్ ,డేంజరస్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ అలాగే అనధికార పార్కింగ్ మరియూ అడ్డంకులు వంటి వివిధ ఉల్లంఘనలకు సంబంధించి ట్రాఫిక్ పోలీసులు ఆర్టీసీ బస్సులపై 3909ట్రాఫిక్ ఛలాన్లు జారీ చేసామన్నారు.డ్రైవర్లు, బాధితుల నిర్లక్ష్యం కారణంగా టీఎస్ ఆర్టీసీ బస్సులకు సంబంధించిన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా డ్రైవర్లు సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ,ఓవర్ స్పీడ్, డేంజరస్ డ్రైవింగ్ వల్ల యాక్సిడెంట్లు జరుగుతున్నాయన్నారు. దాని వల్ల ప్రజల అమూల్యమైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, ఇలాంటి సంఘటనలతో ఆయా కుటుంబాలు విషాదాల్లో మునిగి పోతున్నాయన్నారు. వాహనాలు అతివేగంగంతో నడపడం మద్యం సేవించి నడపడం ఎప్పుడూ ప్రమాదకరమని అన్నారు. రహదారులపై క్రమశిక్షణగా వ్యవహరించాలన్నారు.మీ రక్షణతో పాటు ఇతరుల రక్షణ పట్ల కూడా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## మరొక్కసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి

**ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు**

కూకట్‌పల్లి, నవంబర్ 15, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజలు పూర్తిస్థాయిలో మద్దతు తెలిపి తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పరుస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని మూసాపేట్‌లో వివిధ అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు వివరించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమానికి ఆకర్షితులై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాజీ కార్పోరేటర్ తూము శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం కృష్ణారావు మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేశామని అన్నారు. రెండు సార్లు గెలిపించిన ప్రజలు మూడవసారి కూడా గెలిపిస్తే కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి అన్ని నియోజకవర్గాలలో అగ్రగామిగా నిలుపుతానని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు

## మొదటగా కారు గుర్తుకు ఓటు వేయండీ

**-ఎమ్మెల్యే అభ్యర్థి మెతుకు ఆనంద్ సతీమణి డాక్టర్ సబిత**



కొత్తపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అనంద్ సతీమణి డాక్టర్ సబిత

**కోట్‌పల్లి,నవంబరు 15, ప్రభాతవార్త :**
వికారాబాద్ నియోజక వర్గంలో మొదటగా కారు గుర్తుకు ఓటు వేసి అనంద్ గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మెతుకు అనంద్ సతీమణి డాక్టర్ సబితా అన్నారు. బుధవారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా గడపగడపకు వెళ్ళి కారు గుర్తుకు ఓటు వేయాలని బీఆర్ఎస్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ....గత పాలనలో కాంగ్రెస్ పార్టీ పేదల కోసం చేసింది ఏమి లేదన్నారు. ఈ ఎన్నికలో వికారాబాద్ నియోజక వర్గంలో కారు గుర్తుకు ఓటు వేసి అనంద్‌ను భారీ మోజార్టీతో గెలిపిస్తే వికారాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్‌లో గెలిపోందడం ఖాయమని అమె పేర్కొన్నారు, ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచు గోడ్డలి మల్లయ్య, వైస్ ఎంపీపీ ఉమాదేవి, పార్టీ కార్యకర్తలు పాల్గోన్నారు.

## రొంపల్లిలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిక



బీఆర్ఎస్ వార్డు మెంబర్ ఇతర గ్రామస్తులకు కండువ కప్పి సాదరంగా అహ్వానిస్తున్నా మాజి మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

**బంట్వారం,నవంబరు 15 (ప్రభాతవార్త) :**
మండల పరిధిలోని రొంపల్లి గ్రామానికి చెందిన వార్డు మెంబర్ అనంతయ్య, మొల్లా సర్దర్‌తో పాటు సుమారు 15 మంది గ్రామస్తులు బుధావరం రొంపల్లిలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రేస్‌లో చేరారు. వీరికి మాజి మంత్రి, కాంగ్రేస్ పార్టీ అభ్యార్థి గడ్డం ప్రసాద్‌కుమార్ కండువ కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్బంగా వారు మాట్లాబుతూ....ఇప్పటి వరకు కాంగ్రేస్ సాదించిన ప్రగతె తప్ప బీఆర్ఎస్ చేసింది ఏమి లేదని, ఈ నేపథ్యంలో ఈసారి కాంగ్రేస్‌ను గెలిపించాలని తాము పార్టీ మారుతున్నామన్నారు. ప్రతి ఒక్కరు సైనికులాగ విజాయానికి కృషి చేయాలని ప్రసాద్‌కుమార్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాదకృష్ణగౌడ్, సీనియర్ నాయకులు సంగమేశ్వర్, గోపాల్ తదితరులు పాల్గోన్నారు.

## బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లక్ష్మికి చెక్కును అందజేస్తున్న ఎస్‌బిఐ బ్యాంక్ చీఫ్ మెనెజర్ నరేంద్రనాథరెడ్డి

**జిల్లెడు చౌదరిగూడ, నవంబర్ 15,(ప్రభాతవార్త):**
ఎస్‌బీఐ బ్యాంకు ద్వార అమలు పరుస్తున్న బీమా పథకాలను ఖాతదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ చీఫ్ మేనెజర్ నరేంద్రనాథరెడ్డి అన్నారు. బుదవారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో గల ఎస్‌బీఐ బ్రాంచ్‌లో పది లక్షల అన్సురెన్సు చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గోన్నారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన మెకల శ్రీనివాస్ సంవత్సరానికి 5వందలు చెల్లించి బ్యాంకులో పర్సనల్ యాక్సిడెండ్ ఇన్సురెన్సు చేశాడు. అయితే ఇటివలే ప్రమాదం జరిగి శ్రీనివాస్ మరణించాడు. ఇన్సురెన్సు ద్వార పదిలక్షలు మంజురు అయ్యాయి. ఈ చెక్కును శ్రీనివాస్ భార్య లక్ష్మికి అందజేశారు. ఎస్‌బీఐ ద్వార అందజేస్తున్న ఇన్సురెన్సు పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఎరియా మెనెజర్ సాయిరామ్, చౌదరిగూడ బ్రాంచ్ మెనెజర్ భారతి, క్యాషియర్ జాన్ మనోహార్, నవీన్, ప్రవిణ్, యాదగిరి ఉన్నారు.

## అన్న కోసం చెల్లి ప్రచారం

**ధారూర్ నవంబరు15,ప్రభాతవార్త :** వికారాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం ప్రసాద్ కుమార్ కోసం చెల్లి ప్రియ ప్రచారం నిర్వహించారు. బుధవారం మండల పరిధిలోని కేరెల్లీ గ్రామంలో ఇంటింటా వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ఇప్పటికే మనం చాలా వెనుక పడ్డామని ,ప్రజలు ఆలోచించి చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి అధిక మెజార్టీ తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి శ్రీనివాస్,సీనియర్ నాయకుడు మల్ రెడ్డి,జలేందర్ రెడ్డి, దయాకర్ రెడ్డి,రాంరెడ్డి ,జలవంత్ రెడ్డి,గ్రామ యూత్ నాయకులు ,కార్యకర్తలు,పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శశికాంత్

**శంకర్‌పల్లి, నవంబర్ 15 ప్రభాతవార్త:**
శంకర్‌పల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శశికాంత్‌ను నియమించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి బుధవారం శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్ష నియామక పత్రాన్ని శశికాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాటట్లాడుతూ కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, గుర్తింపు ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు ఎజాస్, సమి, సిద్దిక్, శ్రీశైలం, మల్లేష్, ప్రశాంత్ కుమార్, శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శశికాంత్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి

# ఓట్ల లెక్కింపు కేంద్రం,స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

**పరిగి నవంబరు15,ప్రభాతవార్త :**
శాసనసభ ఎన్నికల సందర్భంగా పరిగి పట్టణంలోని మార్కెట్ యార్డులో చేపట్టిన ఓట్ల లెక్కింపు కేంద్రం,స్ట్రాంగ్ రూమ్‌లను సాధారణ ఎన్నికల పరిశీలకులు,జిల్లా ఎస్పీ కోటిరెడ్డిలతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ నారాయణ రెడ్డి పరిశీలించారు. బుధవారం పరిగి పట్టణంలోని మార్కెట్ యార్డులో డిసెంబర్3న నిర్వహించే ఓట్ల లెక్కింపు సందర్భంగా,కౌంటింగ్ కేంద్రంలో చేపట్టిన మరమ్మత్తు పనులను పరిశీలిస్తూ ఆయన మాట్లాడుతూ...నాణ్యమైన పనులను చేపట్టి వేగవంతంగా నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. పరిగి,వికారాబాద్,తాండూరు,కొడంగల్ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలలో చేపట్టిన పనుల వివరాలను సాధారణ ఎన్నికల పరిశీలకులకు కలెక్టర్ వివరించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద చేపడుతున్న పనులు,వసతులు,సదుపాయాలను పరిశీలించిన పిదప పరిశీలకులు సంతృప్తి వ్యక్తపరిచారు. సాధారణ ఎన్నికల పరిశీలకులు ఆకాష్,సుధాకర్ జైలా



క్స్, ఎస్పీ కోటిరెడ్డి,వికారాబాద్ రిటర్నింగ్ అధికారి విజయ కుమారి,ఆర్అండ్‌బి సురేందర్,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రామ్ రెడ్డి,తహసీల్దార్ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు ఓసారి అధికారం ఇవ్వండి

**-మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్**

**-ఎంసిపల్లి మండలంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ రోడ్‌షో**

**-పాల్గొన్న జడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్**

**శామీర్‌పేట, నవంబరు 15, ప్రభాతవార్త**
తెలంగాణను ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని ఈ ఎన్నికల్లో గెలిపించి అధికారం ఇవ్వాలని, మేడ్చల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిపించాలని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ ప్రజలను కోరారు. బుధవారం మూడుచింతలపల్లి మండలంలోని కొల్తూర్, అనంతారం, పోతారం, నారాయణపూర్, లక్ష్మాపూర్‌తండ, జగ్గంగూడ, కేశవరం, నాగిశెట్టిపల్లి తండ, మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్, లింగాపూర్‌తండ గ్రామాల్లో గడప,గడపకు కాంగ్రెస్ ప్రచారంలో భాగంగ రోడ్‌షో కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బి. నర్సింలుయాదవ్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ ప్రచార కార్యక్రమం జరిగింది. దీనిలో మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం,సుధీర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగ ఆయా గ్రామాల్లో జరిగిన రోడ్‌షోలో మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ఓ సారి అవకాశం ఇవ్వాలన్నారు. ప్రజలు రాష్ట్రంలోనూ, మేడ్చల్‌లోనూ మార్పు రావాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లోనూ రోజురోజుకు కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని ప్రచారంలోనూ మంచి స్పందన, ఆదరణ లభిస్తుందన్నారు. గత పదేళ్లలో పెరిగింది ఏమైనా ఉందంటే అదీ అవినీతి అని ఆయన ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని వజ్రేశ్‌యాదవ్ ప్రజలను కోరారు. మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ ఎం. శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం, సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మేడ్చల్ మరింత అభివృద్ది చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉంది అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ బలహీనవర్గాలకు చెందిన నాయకుడు వజ్రేశ్‌యాదవ్‌ను మెజార్టీతో ఈ ఎన్నికల్లో గెలిపించాలని, గ్రామాల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఎ.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జి.వేణుగోపాల్‌రెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షులు బి.నర్సింలుయాదవ్,శామీర్‌పేట అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, మండల వైస్‌ఎంపిపి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, కొల్తూర్ సర్పంచు శిల్పయాదగిరి, ఎంపిటిసిలు జి.హన్మంత్‌రెడ్డి, అఖిలేశ్‌రెడ్డి, టిపిసిసి మైనార్టీ సెల్ కోఆర్డినేటర్, మండల కోఆప్షన్‌సభ్యులు ఎండి ముజీబ్, మాజీ జడ్పీటిసి పి.బాలేశ్, జి.మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి ఇర్రి రవీందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు బి.జగన్నాథం, వంగ లక్ష్మారెడ్డి, నర్సింలు, వైద్యనాథ్, జైపాల్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, డి.వెంకటేశ, పి.బాల్‌నర్సింహ్మ, పలువురు నాయకులు, కార్యకర్తలు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మూడుచింతలపల్లి మండలం లింగాపూర్‌తండ గ్రామంలో మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ ఓటర్లను కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరుతుండగ,పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, పలువురు నాయకులు

# చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలుస్తుంది

**-కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీమ్ భరత్**



చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్, బిజెపి కార్యకర్తలు

**మొయినాబాద్, నవంబర్ 15 ప్రభాతవార్త:** గత రెండు సార్లుగా నమ్మి బిఆర్ఎస్ పార్టీని గెలిపించిన చేవెళ్ల ప్రజలను కాలె యాదయ్య మోసం చేశారని, నమ్మి ఓట్లేసి గెలిపించిన నాయకులను కార్యకర్తలను కూడా చిన్న చూపు చూశారని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ అన్నారు. బుధవారం మొయినాబాద్ మండలంలోని తోలుకట్ట గ్రామంలో బిఆర్ఎస్, బిజెపికి చెందిన యువకులు వందమంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, తోల్కట్ట గ్రామ మాజీ సర్పంచ్, మండల నాయకులు బొల్లిగిద్ద సత్యనారాయణ ఆధ్వర్యంలో..చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ చేతుల మీదుగా వీరంతా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా యువకులను ఉద్దేశించి భీమ్ భరత్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ప్రతి కార్యకర్తకు ఏదో ఒక రోజు ఉన్నత స్థానం దక్కుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరి పని చేయడానికి వచ్చిన ప్రతి ఒక్కరిని ఆయన అభినందించి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రతి గడపకు ఆరు గ్యారంటీ పథకాలను వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మానేయ, మండల సీనియర్ నాయకులు, తోల్కట్ట మాజీ సర్పంచ్ బొల్లిగిద్ద సత్యనారాయణ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.
**శంకర్‌పల్లి మండలంలో :** బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం లోగుట్టు రాజకీయాలకు తెలంగాణ ముస్లిం మైనార్టీ ప్రజలు బలైపోతున్నారని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో అధికారంలోకి రావాలని బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎంలు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద ఎత్తున ముస్లింలు చేరారు. బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎంలపై ముస్లింలు ఎంత వ్యతిరేకతతో ఉన్నారో ఇదే నిదర్శనమని భీమ్ భరత్ ఈ సందర్భంగా తెలిపారు. శంకర్‌పల్లి తెరాస మైనార్టీ నాయకుడు సిద్ధిక్ ఆధ్వర్యంలో దాదాపు 50 మంది ముఖ్య నాయకులు తెరాస నుంచి కాంగ్రెస్‌లో చేరగా వారిని భీమ్ భరత్ సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పారు. ఈ సందర్భంగా సిద్దిక్ మాట్లాడుతూ కెసిఆర్ ఇచ్చే తప్పుడు వాగ్దానాలు నమ్మి మోస పోవద్దని మైనార్టీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి నాయకులు ఉదయ్ మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, మైనార్టీ నాయకులు ఎజాస్, సమీ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శశికాంత్, కిషోర్, పాల్గొన్నారు.
**షాబాద్ మండలంలో :** కేసీఆర్ గారడి మాటలు ప్రజలు నమ్మొద్దని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ సతీమణి జ్యోతి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని హైతాబాద్, హైతాబాద్ తండా,అంకిగూడ, పెద్దవీడు,పెద్దవీడు తండా, నాన్‌దర్ ఖాన్‌పేట్, దామర్లపల్లి, లింగారెడ్డిగూడ, సాయిరెడ్డిగూడ గ్రామాల్లో గడప గడపకు తిరిగి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు. ఈకార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ పెంటారెడ్డి, సర్పంచులు నరేందర్‌రెడ్డి,ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, పొన్న జయమ్మవెంకట్‌రెడ్డి, ఆశోక్, ఏ బ్లాక్ అధ్యక్షురాలు పీసరి అనితారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, సీనియర్ నాయకులు తమ్మలి రవీందర్, బార్ల యాదయ్య,దండు రాహుల్‌గుప్తా, బుర్ర ఆంజనేయులుగౌడ్, విఘ్నేష్‌గౌడ్, జంగయ్య, గౌరీ, కృష్ణ, ఆశ్వక్‌అలీ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆశ్విని, మాజీ సర్పంచ్ ఖాజామియా, జనార్దన్‌రెడ్డి, మల్లేష్, నర్సింలు, ఆయా గ్రామాల నాయకులు తదితరులు ఉన్నారు.

## శిలాఫలకాలకే పరిమితమైన ఎమ్మెల్యే ఆనంద్ పనితీరు

**-నిధులు తేవడంలో మెతుకు ఆనంద్ విఫలం...**

**-కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్**



ఎన్నికల ప్రచారంలో భాగంగా పీరంపల్లిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

**వికారాబాద్,నవంబర్ 15, ప్రభాతవార్త:** స్థానిక ఎమ్మెల్యే ఆనంద్ పనితీరు శిలాఫలకాలకే పరిమితమైందని, నియోజకవర్గంలో అభివృద్ధి ఆమడ దూరంలో ఉందని కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వికారాబాద్ మండలంలోని సిద్దులూర్, కొటాలగూడెం, పీరంపల్లి, పులుసుమామిడి, కామారెడ్డిగూడ, బురాన్‌పల్లి, గొట్టిముక్ల, ద్యాచారం గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని డప్పుల దరువులతో పోతురాజుల నృత్యాలతో మంగళ హారతులతో ప్రసాద్‌కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, ప్రజలందరూ తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపిస్తే సిద్దులూరు కట్ట మైసమ్మ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే 6 గ్యారంటీల పథకాలను గడపగడపకు అందిస్తానని మాజీ ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గ్రామ గ్రామన బ్రహ్మరథం పడుతున్నారని, ఎన్నికల్లో వికారాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే మన ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. వికారాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో అభివృద్ధికి నోచుకోలేదని, శిలాఫలకాలు తప్ప అబివృద్ధి కనిపించడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎంపీ రంజిత్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మెతుకు ఆనంద్ కోసం పని చేయడం లేదని, వచ్చే ఎంపీ ఎన్నికల్లో ఆయనకు సులభం కావడం కోసమే నాయకులతో మంతనాలు చేస్తున్నారని ఆరోపించారు. వికారాబాద్ ప్రజలకు ఎంపీ రంజిత్‌రెడ్డి డబ్బులు ఇస్తే లొంగరని, నిజాయితీగా ఉండే కాంగ్రెస్ పార్టీని మాత్రమే ప్రజలు ఆదరిస్తారని అన్నారు. త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినైన తనను భారీ మెజార్టీలో గెలిపించాలని ఆయన కోరారు. అధికారంలో వచ్చిన వెంటనే 6గ్యారెంటీ లను తప్పక అమలు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, గురువారెడ్డి, ఆంజనేయులు, పాల్గొన్నారు.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

**షాబాద్, నవంబర్ 15, ప్రభాతవార్త :**
డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.ఎస్ రత్నం సతీమణి ప్రమీల అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని తిర్మలాపూర్, మన్మర్రి,కుర్వగూడ, పోతుగల్, పోతుగల్ తండా, మక్తగూడ, సంకేపల్లిగూడ,శేరిగూడ గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి కె.ఎస్ రత్నంను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ....కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు కుటుంబ పార్టీలేనని అందుకే బీజేపీని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70ఏళ్ల పాలనలో పేదల బ్రతుకులు ఏమి మార్చలేదన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ దోచుకోవడం, దాచుకోవడమే తప్ప ప్రజలకు చేసిందేమిలేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చిన ఒక్కసారి బీజేపీకి అవకాశం కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కిరణ్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, స్వచ్ఛభారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, నాయకులు రవీందర్‌రెడ్డి, మాణెయ్య, సత్యం, మల్లిఖార్జున్, శ్రీశైలం, గోపాల్, నారాయణ, మహేష్, రవిగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## మానాన్నను గెలిపించండి : అనన్య

**మర్పల్లి నవంబర్15 ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలోని కొటమర్పల్లి గ్రామంలో బుధవారంనాడుకాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజి మంత్రీ జి.ప్రసాద్‌కుమార్ కుమార్తె అనన్య బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షులు కృష్ణారెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు రవిందర్,నాయకులు జి .రాములు, అనంత్‌రెడ్డి,పలువురు నాయకులు కార్యకర్తలు ఇం టింటికి ప్రచారాన్ని నిర్వహించారు.ప్రతి ఓటరు వద్దకు వెళ్ళి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తన తండ్రీ ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని అనన్య కోరారు.బిఆర్‌యస్ మాటలు నమ్మరాదనీ గెలిచేది కాంగ్రెస్ పార్టీ అని ఆరు గ్యారంటీ పథకాలు అమలుచేయడం జరుగుతుందని అన్నారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బిఆర్‌యస్ నాయకులు అనన్యఅద్వర్యంలో పార్టీలో చేరారు. ఈకార్యక్రమంలోపలువురు నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గోన్నారు.

## కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు

**-ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కొత్త ఆర్థిక ప్రవీణ్ గౌడ్**



ప్రచారంలో పాల్గొన్న ఆదిభట్ల చైర్‌పర్సన్ ఆర్థిక ప్రవీణ్ గౌడ్

**ఆదిభట్ల నవంబరు15,ప్రభాతవార్త :** పేదల సొంతింటి కలను నెరవేర్చని బీఆర్ఎస్ ప్రభుత్వం మరోమారు అధికారం కోసం పాకులడుతోందని ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆదిభట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త ఆర్థిక ప్రవీణ్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆమె వార్త ప్రతినిధితో మాట్లాడుతూ... కొంగర కలాన్‌లో 2018లో మంత్రి కెటిఆర్‌తో డబుల్ బెడ్ రూంలను ఆర్భాటంగా ప్రారంభించారని అన్నారు. అయినా ఇప్పటికి పిల్లర్‌లకే పరిమితం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవారి సొంతింటి కలను నెరవేర్చని బీఆర్ఎస్ ప్రభుత్వం,స్థానిక ఎమ్మెల్యే కిషన్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు అవసరమా అని ఎద్దేవా చేశారు. 15 ఏళ్లుగా మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉంటూ పేద ప్రజలను మభ్యపెడుతూ వస్తున్నారని, ఇటీవల డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు అవుతాయని దరఖాస్తులు చేసుకోవాలని చెప్పడంతో ఎంతోమంది పేద ప్రజలు దరఖాస్తులు చేశారని అన్నారు. మరోసారి ప్రజలను మోసం చేసి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని ఓటు అడగడానికి వచ్చినప్పుడు ప్రజలు ఈ విషయాన్ని ప్రశ్నించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇల్లు లేని వారు ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు ఇస్తామని సోనియా గాంధీ ప్రకటించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు జరుగుతుందని పేదవారి కలలు నెరవేరుతాయని స్పష్టం చేశారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



.స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గోన్న విద్యార్థులు.

**బొంరాస్‌పేట్,నవంబర్15,ప్రభాతవార్త :**
బొంరాస్‌పేట్ మండలం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్యానాయక్‌తండాలో నవంబర్ 14ను పురస్కరించుకోని బాలల దినోత్సవంసందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడం జరిగిందని పాఠశాల ఎచ్ఎం,టీవివి నాయకులు రవీందర్‌గౌడ్ తెలిపారు. స్వయం పరిపాలన దినోత్సవంలో ఎంఈఓగా అజయ్,పరిశీలకులుగా అరవింద్, ఎచ్‌ఎంగా రజిత,ఉపాధ్యాయులగా నిఖిత,అక్షిత,ప్రీతి,స్నేహ ఉత్సహంగా పాల్గోన్నారు.

## మృతుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం




ఆర్థిక సహాయం అందజేస్తున్న జడ్పీటిసి జర్పుల దశరథ్‌నాయక్

**కడ్తాల్, నవంబరు 15 ప్రభాతవార్త :**
మండల పరిధిలోని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలను గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటి జిల్లా సభ్యులు కడ్తాల్ జడ్పీటిసి జర్పుల దశరథ్ నాయక్ పరామర్శించారు. సాలార్పూర్ గ్రామానికి చెందిన జేమ్లు, హరియా గతం రెండు రోజుల క్రితం మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న జడ్పీటిసి బుధవారం వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాలను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల చొప్పున రెండు కుటుంబాలకు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించగా హరియ కుటుంబానికి ఎంపిటిసి ప్రియా రమేష్ రూ. 3 వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం న్యామంతపూర్ గ్రామానికి చెందిన గోపాల్‌దాస్, కృష్ణయ్య కుటుంబీకులను పరామర్శించారు. కృష్ణయ్య కుటుంబానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన కొప్పుల లింగయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో వారి ఇంటికి చేరుకొని లింగాను పరామర్శించారు. అనంతరం రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బావండ్లపల్లి ఆనంద్, జిల్లా రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యులు బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతు కో ఆర్డినేటర్ జోగు వీరయ్య, సర్పంచ్‌లు గూడూరు లక్ష్మినరసింహారెడ్డి, రవిందర్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు లచ్చిరామ్‌నాయక్, ప్రియా రమేష్, మాజీ ఎంపిటిసి సువాలి, పంతునాయక్, నాయకులు గంపశ్రీను, చంద్రయ్య, శ్రీకాంత్, శ్రీను, జంగయ్య, కృష్ణ పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలను మోసం చేసిన సిఎం కెసిఆర్‌కు గుణపాఠం తప్పదు

**-చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామోన భీంభరత్**



దేవునిఎర్రవల్లిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి పామోన భీంభరత్

**చేవెళ్ల, నవంబర్ 15, ప్రభాతవార్త**
తెలంగాణను సోనియా గాంధీ రాష్ట్రంను ఇస్తే తెలంగాణకు కాపాలాకుక్కలాగా ఉంటానని తెలంగాణ ప్రజలను మోసం చేసి రాష్ట్ర సంపదను దోచుకున్నారని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామోన భీంభరత్ విమర్శించారు. బుదవారం చేవెళ్ల మండల ధర్మసాగర్, గొల్లపల్లి, కమ్మెట, గొల్లపల్లి, ఈర్లపల్లి, ఎనికేపల్లి, ఇబ్రహింపల్లి, మీర్జాగూడ, బస్తేపూర్,కిష్టాపూర్,ఇంద్రారెడ్డినగర్, నాంచేరి, రేగడి ఘనపూర్ గ్రామాలల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామోన భీంభరత్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు చేసిన హమిలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిన సిఎం కెసిఆర్‌కు గుణపాఠం చేప్పాలన్నారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే కాలే యాదయ్య గెలిచి ఎం అభివృద్ధి చేశాడన్నారు. రాజకీయ బిక్ష పెట్టిన కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పోడిచి బిఆర్ఎస్‌కు అమ్ముడుపోయిన యాదయ్యకు గుణపాఠం చేప్పాలన్నారు. కాంగ్రెస్ హయంలోనే ప్రజలకుమెలు జరిగిందన్నారు. చేవెళ్లలో పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సినియర్ నాయకులు వసంతం, అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి,మాజీ సర్పంచులు రెడ్డిశెట్టి మదుసూదన్‌గుప్తా, గోపాల్‌రెడ్డి,ప్రభాకర్,నర్సింలు, మాజి ఎంపిటిసిలు నర్సింహరెడ్డి, పెంటయ్యగౌడ్, చేవెళ్ల సర్పంచ్ శైలజ, ఉప సర్పంచ్ యాద య్య, మాజీ ఉపసర్పంచ్ టెకులపల్లి శ్రీనివాస్ యాదవ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి,మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జూకన్నగారి శ్రీకాంత్‌రెడ్డి, మహిళ అధ్యక్షురాలు దేవర సమతరెడ్డి, ప్రధాన కార్యదర్శి సరిత ప్రతాప్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్, బండారు వెంకట్‌రెడ్డి, మదుసూదన్‌రెడ్డి, దుర్గాప్రసాద్, ప్రభాకర్, పాండు,గోపాల్,సిపిఐ నాయకులు రామస్వామి, ప్రభులింగం, ఎండి మక్బూల్, సుభాన్‌రెడ్డి పాల్గోన్నారు.